## అధ్యాయము 21

# ఇస్సాకు ఇష్మాయేలుల మధ్య ఉద్రిక్తత

అధ్యాయం–21లోని తొలి భాగంలో కథాగమనం వాగ్దానపుత్రుని చుట్టూ తిరుగుతుంది. సుదీర్ఘమైన నిరీక్షణ తర్వాత, ఇస్సాకు రాక (జననం) అబ్రాహాము శారాల గృహంలోకి సంతోషాన్ని తెచ్చింద నడంలో ఏ మాత్రం సందేహం లేదు. అయినప్పటికీ, దేవుని వాగ్దానం నెరవేరేలాగా చూడవలసిన బాధ్యత వారి మీద ఉంది గనక, అబ్రాహాముకు అప్పటికే శారా దాసి హాగరుద్వారా తన కొడుకు ఇష్మాయేలుకు తండ్రి అయ్యాడు గనక, కుటుంబంలో ఉద్రిక్త పరిస్థితి (వివాదం) తలెత్తింది. కాబట్టి, ఇస్సాకు రాక గొప్ప ఉత్తేజాన్నివ్వడంతోబాటు, హాగరు ఇష్మాయేలుల్ని బయటికి వెళ్లగొట్టే వివాదాస్పదమైన పరిణామాన్ని కూడా తెచ్చింది.

అధ్యాయంలోని తరవాత భాగం (చివరి భాగం) అబ్రాహాము మరియు ఫిలిష్తీయుల రాజైన అబీమెలెకు గురించి మరొక భిన్నమైన వృత్తాంతాన్ని తెలియజేస్తుంది. ఈ ఇరువురు మనుషులు ఒకరి పట్ల ఒకరు నిజాయితీగా దయాపూర్వకంగా వ్యవహరించాలని బెయేర్షెబా దగ్గర నిబంధన చేసుకున్నారు.

### ఇస్సాకు జననం (21:1–7)

**[1]యెహోవా తాను చెప్పిన ప్రకారము శారాను దర్శించెను. యెహోవా తానిచ్చిన మాట చొప్పున శారాను గూర్చి చేసెను. [2]ఎట్లనగా దేవుడు అబ్రాహాముతో చెప్పిన నిర్ణయ కాలములో శారా గర్భవతియై అతని ముసలితనమందు అతనికి కుమారుని కనెను. [3]అప్పుడు అబ్రాహాము తనకు పుట్టినవాడును తనకు శారా కనినవాడునైన తన కుమారునికి ఇస్సాకు అను పేరు పెట్టెను. [4]మరియు దేవుడు అబ్రాహాము కాజ్ఞాపించిన ప్రకారము అతడు ఎనిమిది దినములవాడైన ఇస్సాకు అను తన కుమారునికి సున్నతి చేసెను. [5]అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు అతనికి**

**పుట్టినప్పుడు అతడు నూరేండ్లవాడు. [6]అప్పుడు శారా**
**–దేవుడు నాకు నవ్వు కలుగజేసెను**
**వినువారెల్ల నా విషయమై నవ్వుదురనెను.**
**[7]మరియు**
**శారా పిల్లలకు స్తన్యమిచ్చునని**
**యెవరు అబ్రాహాముతో చెప్పును**
**నేను అతని ముసలితనమందు కుమారుని కంటిని గదా? అనెను.**

**వచనము 1**. అబ్రాహాము మరియు శారా తమ వాగ్దాన పుత్రుని కొరకు దాదాపు శతాబ్దంలో పావు భాగం నిరీక్షించిన తర్వాత **యెహోవా తాను చెప్పిన ప్రకారము శారాను దర్శించెను** అని ఉంది. "దర్శించెను" అనే పదం פָּקַד (*paqad*) అనే హెబ్రీ పదానికి అనువాదం. భౌతిక ప్రపంచంలోను (ప్రకృతి), మానవ వ్యవహారాల్లోను దేవునికున్న ప్రమేయం గురించి వ్యక్తంచేసిన ఈ పదం బైబిల్లో పలుసార్లు కనిపించే సర్వసాధారణమైన రూపకాలంకారం. ఈ పదం కొన్నిసార్లు ఇక్కడున్నట్టుగా అనుగ్రహపూర్ణమైన మరియు మేలుకరమైన సందర్శనాన్ని తెలియజేస్తుంది (50:24, 25; నిర్గమ. 4:31; రూతు 1:6; కీర్తన. 8:4 చూడండి); మరి కొన్నిసార్లు, పది ఆజ్ఞల్లోలాగా హెచ్చరికతో కనిపిస్తున్నట్టుగా క్రమశిక్షణాత్మక తీర్పు గురించి కూడా తెలియజేస్తుంది (నిర్గమ. 20:5; 5:9). శారాకు కుమారుడు జన్మిస్తాడని దేవుడు ప్రకటించాడు (17:19; 18:10); ఇక ఇప్పుడు **యెహోవా తానిచ్చిన మాట చొప్పున శారాను గూర్చి చేసెను** అని ఉంది. ఈ వాక్యభాగంయొక్క ఉద్ఘాటన (నొక్కి వక్కాణించడం) గొప్ప అద్భుతంద్వారా దేవుని వాగ్దానం నెరవేరడమని తెలియజేస్తోంది.

**వచనము 2**. యెహోవా స్త్రీలను దర్శించినట్టు బైబిల్లో భావప్రకటనలున్నాయి–హన్నా (1 సమూ. 2:21), ఎలీసబెతు (లూకా 1:68), మరియు శారా దేవుడు దర్శించినందువలన గర్భవతియై కుమారుని కనింది. ఇది అన్యదైవాలు స్త్రీలను దర్శించి శారీరక సంబంధంద్వారా వారికి సంతానం కలిగించేవారనే కల్పిత గాథల్లో ఉన్నట్టుగా ఈ పిల్లలవిషయంలో దేవునికి పితృత్వాన్ని ఆపాదించే భావన కాదు గానీ, దేవుడు సంతానంలేని స్త్రీలను వంధ్యత్వ స్థితినుండి సంతానవతులయ్యే స్థితిలోనికి విమోచించాడనే అర్థాన్నిచ్చే భాషాలంకారం. **శారా గర్భవతియై అతని ముసలితనమందు అతనికి కుమారుని కనెను** అని 21:2 వచనంలో ఉన్న ప్రస్తావన ఈ భావననే నొక్కి వక్కాణిస్తుంది. ఈ సందర్భంలో జరిగినది, పిల్లల్ని కనే వయసు దాటి చాలా కాలం గడిచి వృద్ధులైన వీరిరువురిని దేవుడు దర్శించినప్పుడు వారు నవ్యశక్తితో నూతన చైతన్యం గలవారయ్యారు (రోమా. 4:19). ఈ కారణంచేతనే, శారా గర్భం ధరించి పితరుని ముసలితనంలో అతనికి "కుమారుని" కనిందని వాక్యభాగం నొక్కి చెబ్తోంది. మరొక ప్రాముఖ్యమైన

విషయం, **వాగ్దానపుత్రుని జననం దేవుడు అబ్రాహాముతో చెప్పిన నిర్ణయ కాలములో సంభవించింది** (17:21; 18:14 చూడండి).

**వచనము 3**. ఇంత క్రితం **అబ్రాహాము** ఇష్మాయేలుకు పేరు పెట్టినట్లే (16:15), గడిచిన సంవత్సరం యెహోవా ఆజ్ఞకు అనుక్రియగా (ప్రతిస్పందనగా) ఇప్పుడు **శారాకు పుట్టిన తన కుమారునికి** నామకరణం చేశాడు. తన కుమారునికి అతను ఇస్సాకు అను పేరు పెట్టాడు ("అతను నవ్వెను"), ఈ శిశువు గర్భవాసి కాక పూర్వమే దేవుడు ఈ పేరును ఎంపిక చేశాడు (17:19). ఈ పేరు సముచితమైనదే, ఎందుకంటే వృద్ధాప్యంలో తమకు సంతానం కలుగుతుందనే వాగ్దానంపట్ల అపనమ్మికతో వీరిరువురు నవ్వడం జరిగింది (17:17; 18:12).

**వచనము 4**. ఇస్సాకు జన్మించిన వార్త పితరునిలో భావోద్వేగంతో నిండిన గొప్ప సంతోషాన్ని కలిగించినట్టు వాక్యభాగంలో ఎటువంటి వివరాల్లేవు. అసాధ్యమనుకున్న చిరకాల స్వప్నం నెరవేరింది గనక అతనిలో ఇటువంటి ప్రతిచర్య ఉండవలసినదే. దేవుడు అబ్రాహాముకు కుమారుణ్ణి ఇచ్చే విషయంలో తన వాగ్దానాన్ని నిర్ణయకాలంలో నెరవేర్చడంలో విశ్వాస్యత (విశ్వసనీయత) చూపినట్లే, దేవుడు **అబ్రాహాము కాజ్ఞాపించిన ప్రకారము అతడు ఎనిమిది దినములవాడైన ఇస్సాకు అను తన కుమారునికి సున్నతి జరిగించడంలో జాగరూకత** (అంతర్వివేకం, ధర్మపరాయణత) పాటించాడు. ఈ విషయంలో, పితరుడు మోషేలాగా చేయలేదు, మోషే తన కుమారుని సున్నతి విషయంలో శిశువు పెరిగి బాలుడయ్యే వరకు నిర్లక్ష్యం చేశాడు (నిర్గమ. 2:21, 22; 4:24–26).

**వచనము 5**. సరిగ్గా ఒక సంవత్సరం క్రిందట **అబ్రాహాము** అడిగిన "నూరేండ్లవానికి సంతానము కలుగునా?" అనే ప్రశ్నకు (17:17)–ఇప్పుడు జవాబు లభించింది. ప్రకృతిసిద్ధమైన సహజధర్మానికి ఏది అసాధ్యమో, దేవుని శక్తిద్వారా అది వాస్తవికంగా సంభవమైంది. పితరుడు, **కుమారుడైన ఇస్సాకు అతనికి పుట్టినప్పుడు అతడు నూరేండ్లవాడు**.

**వచనము 6**. శిశువు పుట్టినప్పుడు, యెహోవా తనకు చేసిన కార్యాన్నిబట్టి పొంగి పొర్లే సంతోషంతో **శారా** ఒక గీతం పాడింది. **ఆమె, దేవుడు నాకు నవ్వు కలుగజేసెను వినువారెల్ల నా విషయమై నవ్వుదురు** అని తన మనోభావాల్ని వెల్లడి చేసింది. ఇక్కడ, శారా "ఇస్సాకు" అనే పేరును వాక్చాతుర్యంతో (శబ్దక్రీడ, శ్లేషచమత్కారం) ఉపయోగించింది. ఇంత క్రితం, ఈ పేరు అపనమ్మికకు సంబంధించిన నవ్వును సూచించేదిగా ఉంది (17:17–19; 18:12–15). ఇప్పుడు, ఆమె వెల్లివిరిసే ఉత్సాహంతో తన లోపలినుండి ఉబికి వస్తున్న నవ్వును అనుభవిస్తోంది; వృద్ధ స్త్రీ ఒక శిశువుకు జన్మ నివ్వడం గురించి విన్న వారు ఆమెతో కలిసి నవ్వుతారని–కొందరు ఈ బహిరంగ ప్రకటన గురించి వ్యాఖ్యానించినట్టుగా, ఆమెను "చూచి" కాదని శారా బలంగా నమ్మింది. ఎగతాళి

చేస్తూ నవ్వడం అనే ఆలోచనకు ఈ సందర్భంలో తావు లేనే లేదు. వృద్ధాప్యంలో తమకు సంతానాన్నిచ్చి తమను తలిదండ్రుల్ని చేసిన దేవుని గొప్ప కార్యాల్నిబట్టి శారా ఆశ్చర్యచకితురాలై సంతోషించడం తథ్యం.[1]

**వచనము 7.** ఇంకా, ఇస్సాకు పుట్టినందువలన శారా తనకు కలిగిన గొప్ప సంతోషం గురించి చెబ్తూనే ఉంది. గొడ్రాలిగా శారా అనుభవించిన శూన్యత నిరాశానిస్పృహల స్థానంలో, ఇప్పుడు మాతృత్వపు ఆనందం ఉవ్వెత్తున పొంగి పొర్లగా ఆమె భావాతిశయంతో అడిగిన ప్రశ్న: **శారా పిల్లలకు స్తన్యమిచ్చునని యెవరు అబ్రాహాముతో చెప్పును?** ఈ ప్రశ్నకు జవాబు వ్యతిరేకార్థకమైనదే: "సాధారణ పరిస్థితుల్లో ఎవరైనా గానీ, శారా ఇప్పుడే ప్రసవించి బిడ్డకు పాలిస్తోంది అని అబ్రాహాముతో చెప్పడం సాధ్య మైనది కాదు కదా." ఇటువంటి అవకాశంపట్ల పితరుడు అతని భార్య అప్పటికే దేవునిలో అపనమ్మిక వెలి బుచ్చినందుకుగాను, వాస్తవానికి ఇది వారి వయసులో ఊహామాత్రంగానైనా నమ్మశక్యంగాని వార్తయే అవుతుంది. ఏదేమైనా, "అసాధ్యమైన సాధ్యత" సంభవమైంది, శారా **నేను అతని ముసలితనమందు కుమారుని కంటిని** అని ఆశ్చర్యచకితురాలైంది.

## శారా రోషం (21:8–14)

**[8]ఆ పిల్లవాడు పెరిగి పాలు విడిచెను. ఇస్సాకు పాలు విడిచిన దినమందు అబ్రాహాము గొప్ప విందు చేసెను. [9]అప్పుడు అబ్రాహామునకు ఐగుప్తీయురాలైన హాగరు కనిన కుమారుడు పరిహసించుట శారా చూచి [10]–ఈ దాసిని దీని కుమారుని వెళ్లగొట్టుము; ఈ దాసి కుమారుడు నా కుమారుడైన ఇస్సాకుతో వారసుడై యుండడని అబ్రాహాముతో అనెను. [11]అతని కుమారునిబట్టి ఆ మాట అబ్రాహామునకు మిక్కిలి దుఃఖము కలుగజేసెను. [12]అయితే దేవుడు–ఈ చిన్నవానిబట్టియు నీ దాసినిబట్టియు నీవు దుఃఖపడ వద్దు. శారా నీతో చెప్పు ప్రతి విషయములో ఆమె మాట వినుము; ఇస్సాకువలన అయినదియే నీ సంతాన మనబడును. [13]అయినను ఈ దాసి కుమారుడును నీ సంతానమే గనుక అతని కూడ ఒక జనముగా చేసెదనని అబ్రాహాముతో చెప్పెను. [14]కాబట్టి తెల్లవారినప్పుడు అబ్రాహాము లేచి ఆహారమును నీళ్ల తిత్తిని తీసికొని ఆ పిల్లవానితోకూడ హాగరునకు అప్పగించి ఆమె భుజముమీద వాటిని పెట్టి ఆమెను పంపివేసెను. ఆమె వెళ్లి బెయేర్షెబా అరణ్యములో అటు ఇటు తిరుగుచుండెను.**

ఇస్సాకు జననం అబ్రాహాము శారాలకు గొప్ప సంతోషాన్నిచ్చింది. అయితే, ఇంటిలో ఉన్నవారిలో అందరూ అతనిని స్వాగతించలేదు.

**వచనము 8.** వాగ్దానపు **పిల్లవాడు** పెరిగి పాలు త్రాగడం విడిచే వరకు వృద్ధులైన పితరుడు అతని భార్య వేచి చూశారు. పిల్లవాడు పాలు విడిచిన

దినమందు **అబ్రాహాము గొప్ప విందు చేసెను** అని ఉంది. ప్రాచీన పశ్చిమాసియాలో మూడు సంవత్సరాల వయసులో పిల్లలు తల్లిపాలు విడవడం జరిగేది, పాలు విడిచిన సమయంలో విందుచేయడం పరిపాటి.[2]

**వచనము 9**. అయితే, ఈ సందర్భంలో వేడుకలోని సంతోషం కొద్దిసేపట్లోనే ఆవిరైంది; **శారాకు హాగరుకు** మధ్య ఉన్న పాత ద్వేషాలు మళ్లీ రగులుకొనడంతో శారా సంతోషం పాడైపోయింది. వేడుక జరిగే సమయంలో అప్పటికి సుమారు పదహారు లేక పదిహేడు సంవత్సరాల వయసువాడైన[3] ఇష్మాయేలు చాలా చిన్నవాడైన ఇస్సాకును చూచి ఎగతాళిచేస్తూ నవ్వాడు. ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన తీక్షణమైన విషయమేమింటే, శారా తన కుమారుణ్ణి ఇష్మాయేలు పరిహసించుట (צָחַק, *tsachaq*) చూచింది. సందర్భాన్ని నుసరించి, *tsachaq* అనే పదానికి పలు అర్థాలున్నాయి. అయినా గానీ, ఈ సందర్భంలో పరిహసించుట అనే పదం అంత తీక్షణమైందిగా కనబడలేదు, ఎందుకంటే పౌలు, ఇష్మాయేలు ఇస్సాకును "హింస" పెట్టినట్టు (గలతీ. 4:29)[4] ఈ వాక్యభాగాన్ని అర్థం చేసుకున్నాడు. హాగరు కుమారుడు ఈ చిన్న వాడిపట్ల అసలు ఏం చేశాడో మనకు ఇతమిత్థంగా తెలియడం లేదు; అయితే శారాకు తన కుమారుని విషయంలో ఇష్మాయేలు ఆపదగా కనిపించాడు. అబ్రాహాముకు నిజమైన వారసుడి స్థాయిని ఇస్సాకు ఎన్నటికీ పొందలేడని అతని మనసును గాయపరుస్తూ ఇష్మాయేలు నేరుగా అపహాస్యం చేశాడని కొందరి అభిప్రాయం. అదీగాక, ఇష్మాయేలు మాట్లాడిన మాటలు ఇబ్బందికరంగా అంటే అశుభంగా (నష్టం కలిగించేవిగా లేక హాని కలిగించేవిగా[5]) అనిపించి ఉండవచ్చు.

**వచనము 10**. శారా తన కళ్లతో చూచిన దృశ్యం తన కుమారుని శరీరం గాయపడుతుందేమోనని ఆమెను భయపెట్టి ఉండవచ్చు, లేదా ఇష్మాయేలు చర్యలు రాబోయే కాలంలో తన కుమారుని ప్రాణానికి ముప్పు కలిగించే హింసాత్మక ఘటనలుగా మారతాయేమోనని శారా తలంచి ఉండవచ్చు. కాబట్టి, ఆమె **ఈ దాసిని దీని కుమారుని వెళ్లగొట్టుము; ఈ దాసి కుమారుడు నా కుమారుడైన ఇస్సాకుతో వారసుడై యుండడు** అని తన భర్తతో వాదించింది.

హాగరును ఇష్మాయేలును బయటికి "వెళ్లగొట్టు"మని శారా అబ్రాహామును వేడుకున్నప్పుడు ఆమె גָּרַשׁ (*garash*) అనే పదాన్నుప యోగించింది. దేవుడు "ఏదెను తోటలోనుండి అతని (ఆదాము) పంపి" నప్పుడు ఈ పదమే 3:24 వచనంలో "ఆదామును వెళ్లగొట్టి" అని కనబడుతుంది. ఈ పదం మళ్లీ 4:14లో కయీను విషయంలో "ఈ ప్రదేశమునుండి ... వెళ్లగొట్టి" అని కనబడుతుంది. మోషే ధర్మశాస్త్రానికి పూర్వం, ఈ పదం భార్యను పరిత్యజించడాన్ని (విడాకుల్ని) సూచించే పారిభాషిక పదం కానప్పటికీ 21:10 వచనంలో ఇదే భావాన్ని సూచిస్తోంది; అయితే, మోషే ధర్మశాస్త్రంలో వివాహాన్ని రద్దుచేసుకొనే సందర్భంలో భార్యాపరిత్యాజ్యానికి (విడాకులకు, భార్యను బొత్తిగా విడిచిపెట్టడానికి) పారిభాషిక

పదంగా ఈ పదం చేరిక అయ్యింది (లేవీ. 21:7, 14; 22:13; సంఖ్యా. 30:9; మరియు యెహెజ్కేలు 44:22 చూడండి).[6]

**వచనము 11.** సాధారణంగా ఒకరికంటె ఎక్కువ మంది భార్యలున్నవారికి ఎదురయ్యే సందిగ్ధావస్థ (ఉభయసంకటం) అబ్రాహాముకు ఎదురైంది: అతనిప్పుడు ఎవరు కావాలో అంతిమంగా నిర్ణయించు కోవాలి (తేల్చుకోవాలి). ఇష్మాయేలు అనే **అతని కుమారునిబట్టి ఆ మాట అబ్రాహామునకు మిక్కిలి దుఃఖము కలుగజేసెను** అని రచయిత చెబ్తూ అతనిలో (అబ్రాహాములో ) కలిగిన అంతర్ముఖ సంఘర్షణను వర్ణించాడు. మొదట పుట్టిన కుమారునిపట్ల వృద్ధుని ప్రేమ అధికమే, కానీ ఇప్పుడు శారా అవశ్యాభ్యర్ధన అతని అంతరంగాన్ని క్షోభపెట్టి అతనిని వ్యథాభరితుణ్ణి చేసింది. దేవుడు అంతకు ముందే నిబంధనాను సారమైన ఆశీర్వాదాన్ని అందుకోడానికి ఇస్సాకును వాగ్దానపుత్రునిగా నిర్ధారించాడు గనక (17:17–20; 18:9–15), ఈ ఇద్దరు స్త్రీలు ఎందుకు సామరస్యంగా ఉండలేరో అబ్రాహాము బహుశా ఆలోచించి ఉండ వచ్చు. ఏదేమైనప్పటికీ, ఈ ఇద్దరి భార్యల మధ్య నానాటికీ పెచ్చుమీరుతున్న వైరం సమసిపోయేటట్టు లేదు; ఇక ఇప్పుడు, ఇష్మాయేలు మాటల్లో చర్యల్లో ఇస్సాకుపట్ల అపాయకరమైన ద్వేషం ఉన్నట్టు శారా గ్రహించడంతో, పితరుని ఇంట్లో పరిస్థితి చక్కబడేటట్టుగా లేదు.

**వచనము 12. దేవుడు, ఈ చిన్నవానిబట్టియు నీ దాసినిబట్టియు నీవు దుఃఖపడవద్దు** అని అబ్రాహామును ఆజ్ఞాపించాడు. "చిన్నవాని" అని అనువదించబడిన (נַעַר, *na'ar*) అనే హెబ్రీ పదాన్ని శిశుప్రాయం మొదలు యుక్తవయసు దాటేవరకు మధ్యలో ఉన్న మగపిల్లవాణ్ణి సూచించడానికి ఉప యోగించేవారు. ఉదాహరణకు, హన్నా సమూయేలుకు పాలు మాన్పినప్పుడు అతనికి (1 సమూ. 1:24), పదిహేడు సంవత్సరాల వయసులో ఉన్న యోసేపును సూచిస్తూ (37:2), మళ్లీ అతనికి ముప్పయి సంవత్సరాలున్నప్పుడు (41:12, 46) *na'ar* అనే పదాన్నే ఉపయోగించడం జరిగింది. దేవుడు ఇష్మాయేలును "చిన్నవాని" అనడంలో అతను ఇస్సాకులాగా మరీ చిన్నవాడనే అర్థాన్ని తీసుకొనకూడదు.

వ్యక్తిగతమైన సంవేదనలకంటె (అవ్యక్తానుభూతులు) ముఖ్యమైనవేవో ఈ ఇంటి వ్యవహారాల్లో ఉన్నట్టుగా కనబడుతోంది. పితరుని భావితరాల సంతానానికి మరియు అంతిమంగా భూమ్మీద ఉన్న అన్ని వంశాలవారికి యెహోవా ఆశీర్వాదాల్ని అందించే వాహకం (మాధ్యమం) ఇస్సాకు. కాబట్టి, దేవుడు, **శారా నీతో చెప్పు ప్రతి విషయములో ఆమె మాట వినుము; ఇస్సాకువలన అయినదియే నీ సంతాన మనబడును** అని శారా విషయంలో అబ్రాహామును ఆజ్ఞాపించాడు (12:2, 3; 17:19 చూడండి). ఇంకా చెప్పాలంటే, నిబంధనానుసారమైన ఆశీర్వాదాల్లో ఇస్సాకు ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాడు, భావితరాల్లోని దేవుని ప్రజలు తమ వంశావళిని అబ్రాహాము మొదలు వాగ్దానపుత్రుడైన ఇస్సాకు ద్వారా

అని కంఠో పాఠంగా చెప్పుకోవాలి.

హాగరును ఇష్మాయేలును పంపివేయమని దేవుడు అబ్రాహామును ఆజ్ఞాపించవలసిన అవసరం రావడానికి పలు కారణాలున్నాయి. (1) పితరుడు ఈ ఇద్దరినీ ప్రేమించాడు, తన బానిస–భార్యను తన మొదటి కుమారుణ్ణి బయటికి పంపించాలనే ఆలోచన సైతం అతని హృదయాన్ని పగులగొట్టినదిగా ఉంది. (2) అబ్రాహాము గతంలో తాను శారా మాటను, అంటే తాను హాగరుద్వారా సంతానం పొందాలనే మాటను మన్నించిన సందర్భాన్ని బహుశా గుర్తుకు తెచ్చుకొని ఉండవచ్చు. ఆమె ఉద్దేశం అతని కార్యం రెండూ వారి విషయంలో విశ్వాసంలో లోపాన్ని ఎత్తి చూపడంతోబాటు వారి ఇంట్లో అన్ని రకాల సమస్యలకు కారణమయ్యాయి (16:1–6). (3) అబ్రాహాము కాలంనాటి ప్రాచీన పశ్చిమాసియా సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం అతని భార్యకు కాదు గానీ, అతనికి మాత్రమే కుటుంబ వ్యవహారాల్లో నిర్ణయం తీసుకొనే హక్కు (అధికారం) ఉంది. ఈ కారణంచేత, వారిని పంపించివేసే విషయంలో అతను శారా చెప్పినట్లు చేయాలని దేవుడు ఆజ్ఞాపించినందుకు అబ్రాహాము కోపం తెచ్చుకొని ఉండవచ్చు, ఎందుకంటే పితరుని ఆలోచన కాదు గానీ శారా చెప్పినదే దేవుని ఆలోచనల ప్రకారం ఉంది.

**వచనము 13**. దేవుడు అబ్రాహాముతో ఇష్మాయేలుగురించి "అతనిని గొప్ప జనముగా చేసెదను" అని 17:20లో చేసిన వాగ్దానాన్ని మళ్లీ ఇక్కడ చెప్పాడు. పితరుడు తన మొదటి కుమారుని ఆమె తల్లిని పంపివేసిన తర్వాత వారికి ఎటువంటి చేటు (నాశనం) కలగదని దేవుడు అభయాన్నిస్తూ, **ఈ దాసి కుమారుడును నీ సంతానమే గనుక అతని కూడ ఒక జనముగా చేసెదను** అని అబ్రాహాముతో చెప్పాడు. ఈ విధంగా, దేవుడు ఆదరణ వాక్కులతో కలత చెందిన పితరుని హృదయానికి ప్రశాంతత నిచ్చాడు. వచనం 13లో దేవుడు ఇష్మాయేలుగురించి చేసిన వాగ్దానాన్ని, వచనం–12లో తాను ఇస్సాకు గురించి చెప్పిన నిశ్చయమైన వార్తతో సంధానపర్చి చెప్పడం విశేషంగా కనబడుతుంది.

**వచనము 14**. తన బానిస–భార్యను తన మొదటి కుమారుని బయటికి పంపివేయవలసి వచ్చిందనే హృదయభారంతో అబ్రాహాముకు ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదని తెలుస్తోంది. మళ్లీ వారిని చూడ గలుగుతాననే ఆశ అతనిలో ఏ మాత్రం లేదు. నెమ్మదిలేని రాత్రి గురించి ప్రక్కన పెడ్తే, భరించరాని ఎండ తీవ్రతకు గురి కాకుండా మధ్యాహ్న సమయంలోపే సాధ్యమైనంత ఎక్కువ దూరం వెళ్లేలా హాగరును ఇష్మాయేలును పంపించివేయాలని అబ్రాహాము ఆలోచించి ఉండవచ్చు. కాబట్టి, తెల్లవారినప్పుడు **అబ్రాహాము లేచి ఆహారమును నీళ్ల తిత్తిని తీసికొని ఆ పిల్లవానితోకూడ హాగరునకు అప్పగించి ఆమె భుజము మీద వాటిని పెట్టి ఆమెను పంపివేసెను** అని వాక్యభాగం తెలియజేస్తోంది.

అరణ్యంలో ప్రయాణం చేయబోయే తన ఇంటివారికి పితరుడు ఆహారం నీటితిత్తిని[7] మించి ఎక్కువేమీ ఇవ్వకుండా పంపివేశాడని పాఠకులకు ఆశ్చర్యం

కలగవచ్చు. వారికి మార్గమధ్యంలో ఇంకేమైనా ఆహారపదార్థాలు దొరుకుతాయేమోనని అతను (పితరుడు) ఎదురు చూస్తున్నాడా? శారా కోపం ఎక్కువ సేపు ఉండదని వారు మళ్లీ వెనకకు రాగలరనే నమ్మకం, వారు ఎక్కువ దూరం వెళ్లకూడదనే రహస్యమైన ఉద్దేశం అబ్రాహాములో ఏమైనా ఉన్నాయేమో?

దుఃఖపడే భర్తగా తండ్రిగా అబ్రాహాముకు గతంలో హాగరు అరణ్యంలోకి పారిపోయినప్పుడు జరిగిన సంఘటన, "యెహోవా దూత అరణ్యములో నీటిబుగ్గయొద్ద ... ఆమెను కనుగొని" (16:7–14) ఆమెను వెనక్కు పంపడం గుర్తుకు వచ్చే ఉంటుంది. ఈసారి కూడా ఆమెకు ఇష్మాయేలుకు అటువంటి అనుభవమే ఎదురు కానుందా? సరే గానీ, పితరుని మనసులో ఎటువంటి తలంపులు ఎగసిపడ్డాయో మనకు తెలియకపోయినప్పటికీ, అసలు అవి ఎటువంటివైనప్పటికీ, మాడ్చివేసే తీక్షణమైన ఎండ ఉండే అరణ్యంలో ఇద్దరు మనుషులకు ఒక రోజుకైనా సరిపోయే నీటిని వారికి అబ్రాహాము ఇవ్వలేదు.[8] దేవుడెలాగైనా మధ్యలో జోక్యం చేసుకొని నీరు లభించని ఆ నిర్జనప్రాంతంలో వారు నశించిపోకుండా కాపాడతాడని అబ్రా హాము నమ్మి ఉండవచ్చు.

అబ్రాహాము ఆ పిల్లవానితోకూడ హాగరునకు **అప్పగించి ఆమె భుజముమీద వాటిని పెట్టి ఆమెను పంపివేసెను** అనే ప్రకటన మరొక సమస్యను లేవనెత్తుతోంది. హాగరు తన భుజంమీద అసలు ఏం మోసింది? సెప్టువజింటు (LXX) మరియు సిరియన్ పెషిట్టా అనువాదాలు, ఆహారం నీటితోబాటు, పిల్లవాణ్ణి (ఇష్మాయేలు) కూడా అబ్రాహాము ఆమె భుజంమీద పెట్టినట్టు సూచిస్తున్నాయి. పలు ఆధునిక వ్యాఖ్యానాలు మరియు అనువాదాలు (ఆంగ్లంలో – RSV; NRSV; NEB; REB; NAB; JB; NJB; TEV; NJPSV; NCV; CEV; ESV మొదలైనవి) ఇదే విషయాన్ని తెలియజేస్తున్నాయి. దీనికి తోడు, కొందరు బైబిలు వ్యాఖ్యాతలు ఈ అభిప్రాయాన్ని సమర్థించడంకొరకు ఆదికాండము రచయిత ఈ వృత్తాంత వర్ణనలో పరస్పర విరుద్ధమైన ఆధారాల్ని పరిగణనలోకి తీసుకొని ఉండవచ్చనే సహేతుకమైన నిర్ణయానికొచ్చారు. హాగరు తన భుజంమీద యుక్తవయస్కుణ్ణి మోయడం ఆమె వలన కాదు కాబట్టి, ఇష్మాయేలు బహుశా ఆ సమయంలో చంటి పిల్లవాడేమోననే వాదం ఉంది, అయితే ఇది 21:9 వచనంమీద చర్చకు మరియు 16:1–4, 16 వచనాల్లోని కాలక్రమానుగత చారిత్రక వివరాలకు విరుద్ధంగా కనబడుతోంది.

హెబ్రీ వాక్యనిర్మాణం కొంతమేరకు అసంబద్ధంగా ఉన్నప్పటికీ, NASB మరియు NIV ప్రతులు వ్యక్తమైనట్టుగా ఈ వాక్యభాగాన్ని అర్థంచేసుకొనడానికి ఇదొక్కటే–లేక ఇదే ఉత్తమమైందనే వీల్లేదు. హెబ్రీ శబ్దానువాదం (యథాక్షర అనువాదం) ఇలా ఉంటుంది: "కాగా అబ్రాహాము వేకువనే లేచి మరియు ఆహారాన్ని నీటితిత్తిని తీసికొని, మరియు (వాటిని) హాగరుకిచ్చి (వాటిని) ఆమె భుజంమీద పెట్టి, మరియు అతను (ఆమెకు) పిల్లవాణ్ణి ఇచ్చి, మరియు ఆమెను

పంపివేశాడు."[9]

21:10 వచనంలోని "వెళ్లగొట్టు" (*garash*) అనే పదం, "పంపివేసెను" అనే భావప్రకటన (שָׁלַח, *shalach*) క్రమేపీ "భార్యాపరిత్యాజ్యం" (విడాకులు, భార్యను బొత్తిగా విడిచిపెట్టడం) అనే అర్థాన్నిచ్చే పర్యాయి (ద్వితీ. 22:19, 29; యెష. 50:1; యిర్మీయా 3:1; మలాకీ 2:16). అయితే, రెండో పదం మొదటి పదమంత పరుషమైనదిగా కనబడడం లేదు. శారా "ఈ దాసిని దీని కుమారుని వెళ్ల గొట్టుము" అని అబ్రాహామును కోరుకున్నప్పటికీ, అతను "ఆమెను పంపివేసెను" అని కనబడుతోంది. అతని చర్యల్లో ద్రోహచింతన లేదు; విశేషించి అతను దేవుని చిత్తానికి లోబడుతున్నాడు.

హాగరు దిక్కులేని దేశదిమ్మరిలా ఉందని తదుపరి ప్రకటన తెలియజేస్తోంది. ఆమె వెళ్లి బెయేర్షెబా అరణ్యములో అటు ఇటు తిరుగుచుండెను. ఆమె పారిపోయి ఐగుప్తులోకి వెళ్లడానికి ప్రయత్నించిందనే అధ్యాయం 16లోని వివరణకు భిన్నంగా, ఈ సారి ఆమె మనసులో గమ్యం అంటూ ఏదీ లేదేమో. ఆమె, ఆమె కుమారుడు ఉండడానికి గూడు లేక, ఏ వైపునుండి ఏ సహాయంగానీ ఏ ఆశ్రయంగానీ లేక ఒంటరి వారయ్యారు. వారు ప్రాచీన కనాను దక్షిణభాగంలో బెయేర్షెబా సమీపంలోని అరణ్యంలో సంచరించారు. అబ్రాహాము ఇంకా అప్పటికి అబీమెలెకు రాజుగా ఉన్న గెరారులోనే నివసిస్తున్నాడని తెలుస్తోంది (20:1; 21:22–34 చూడండి). బహుశా, పంపివేయబడినవారిద్దరూ తూర్పువైపు, ఒక వేళ ఉత్తర అరేబియా దిశగా అంటే తదుపరి కాలంలో ఇష్మాయేలు వంశస్థుల్లో కొందరు నివసించిన ప్రాంతంవైపు ప్రయాణించి ఉండవచ్చు (25:12–18). వారు బెయేర్షెబా అరణ్యంలో సంచరిస్తున్నారనడంలో వ్యంగ్యార్థం స్ఫురిస్తోంది, ఎందుకంటే బెయేర్షెబా పేరులోని తొలి సగం "బావి" (בְּאֵר, *b<sup>e</sup>'er*) అనే అర్థాన్ని సూచిస్తుంది. అక్కడనే బావి ఉన్నప్పటికీ, దేవుని దూత చూపించేవరకు హాగరు ఆ బావిని చూడలేదు.

## హాగరుకు దివ్య వాగ్దానం (21:15–21)

**[15]ఆ తిత్తిలోని నీళ్లు అయిపోయిన తరువాత ఆమె ఒక పొద క్రింద ఆ చిన్నవాని పడవేసి [16]యీ పిల్లవాని చావు నేను చూడలేనని అనుకొని, వింటివేత దూరము వెళ్లి అతని కెదురుగా కూర్చుండెను. ఆమె యెదురుగా కూర్చుండి యెలుగెత్తి యేడ్చెను. [17]దేవుడు ఆ చిన్నవాని మొరను వినెను. అప్పుడు దేవుని దూత ఆకాశమునుండి హాగరును పిలిచి–హాగరూ నీకేమి వచ్చినది? భయపడకుము; ఆ చిన్నవాడున్న చోట దేవుడు వాని స్వరము వినియున్నాడు; [18]నీవు లేచి ఆ చిన్నవాని లేవనెత్తి నీ చేత పట్టుకొనుము; వానిని గొప్ప జనముగా చేసెదనని ఆమెతో అనెను. [19]మరియు దేవుడు ఆమె కన్నులు తెరచినందున ఆమె నీళ్ల ఊట చూచి వెళ్లి ఆ తిత్తిని నీళ్లతో నింపి చిన్నవానికి త్రాగ నిచ్చెను. [20]దేవుడు ఆ**

**చిన్నవానికి తోడైయుండెను. అతడు పెరిగి పెద్దవాడై ఆ అరణ్యములో కాపురముండి విలుకాడాయెను. [21]అతడు పారాను అరణ్యములో నున్నప్పుడు అతని తల్లి ఐగుప్తుదేశము నుండి ఒక స్త్రీని తెచ్చి అతనికి పెండ్లిచేసెను.**

**వచనము 15**. అరణ్యంలో ఒక రోజు సంచరించడానికి తగినంత నీటిని హాగరు మరియు ఇష్మాయేలు తమతో తీసుకొని వెళ్లలేదు సరి కదా, పైపెచ్చు మధ్యాహ్న సమయంలోని ఎండ తీవ్రతకు వారి గురయ్యారు. ఆ **తిత్తిలోని నీళ్లు అయిపోయిన తరువాత**, వారు దాహంతీర్చుకొన లేకపోయారు గనక, హాగరు **ఒక పొద క్రింద ఆ చిన్నవాని పడవేసినదని** తెలుస్తోంది. ఒక తల్లి మిక్కుటమైన వ్యాకులపాటుతో తన కుమారుణ్ణి ఎడారిలోని పొద క్రింద పడవేసిన సంఘటన గురించిన వర్ణన ఈ వాక్యభాగంలో కనబడు తుంది. ఇక్కడ అంతర్భావం ఏమిటంటే తనకు సహాయం లభిస్తుందనే నమ్మకం కోల్పోయిన హాగరు తన కుమారునికి ఇక మరణం తథ్యమని అనుకుంది. చివరి క్షణాల్లో సాధ్యమైనంతవరకు అతనికి ఎంతో కొంత నెమ్మది నిచ్చే ప్రయత్నంలో, హాగరు అతనిమీద సూటిగా ఎండపేడిమి పడకుండా అతనిని నీడలో ఉంచింది.

**వచనము 16**. ఇష్మాయేలు బాధపడడం హాగరు చూడలేకపోయింది; **కాబట్టి ఆమె వింటిపేత దూరము వెళ్లి అతని కెదురుగా కూర్చుంది**, వింటిపేత దూరం అంటే ఒక వ్యక్తి బాణం వేస్తే అది వెళ్లేంత దూరం. అతను ఆమెకు కనబడకపోయినప్పటికీ, సహాయంకొరకు అతని వేసే కేకలు వినబడేంత దగ్గర లోనే ఆమె వేచి ఉందేమో. ఎండపేడిమికి వేసారిపోయి శుష్కించిపోయిన వ్యక్తి ఎండిపోయిన గొంతుతో కేక వేయగలడని ఆమె అనుకొనడం వృథాప్రయాసే. కూర్చుని ఉన్న హాగరు, తన కుమారుణ్ణి మ్రింగి వేస్తున్న మరణాన్ని ఆపలేని నిస్సహాయురాలై, **యీ పిల్లవాని చావు నేను చూడలేనని** అంతులేని నిరాశతో మొరపెట్టింది. ఇష్మాయేలు బ్రతకాలంటే ఆమెకు ఇక మిగిలిన ఏకైక ఆశ (ఆధారం) దేవుడు జోక్యం చేసుకొనడం మాత్రమే; కాబట్టి ఆమె యెలుగెత్తి యేడ్చెను అని వాక్యభాగంలో కనబడుతోంది.

**వచనము 17**. బాధాకరమైన ఈ క్షణంలో **దేవుడు ఆ చిన్నవాని మొరను వినెను అని** వాక్యభాగం తెలియజేస్తోంది. అప్పుడు **దేవుని దూత ఆకాశమునుండి హాగరును పిలిచి–హాగరూ నీకేమి వచ్చినది** అని అడగడం జరిగింది. ఇది కచ్చితంగా జవాబు కోరి అడిగిన ప్రశ్న కాదు, ఎందుకంటే జవాబు చెప్పే అవకాశం దేవుని దూత ఆమెకు ఇవ్వలేదు. ఇందుకు బదులుగా, **ఆయన వెంటనే భయపడకుము; ఆ చిన్నవాడున్న చోట దేవుడు వాని స్వరము వినియున్నాడు** అని ధైర్యాన్నిస్తూ మాట్లాడాడు (16:11; 17:20 వివరణలు చూడండి). అభయాన్నిచ్చే ఈ ప్రకటన అబ్రాహాము తాను ప్రేమించిన ఆ ఇద్దరిని కొద్దిపాటి ఆహారపదార్థాలతో అరణ్యంలోకి ఎలా పంపించాడనే ప్రశ్నకు జవాబు చెప్తోంది

(21:14). పితరుని జీవితంలో ఇది జరిగే సమయానికి, దుస్సాధ్యమైన ఈ ప్రయాణంలో యెహోవాయే వారిని ఆదుకుంటాడని ఆయనే వారికి కావలసినవి ఇస్తాడని నమ్మే సంసిద్ధత గల స్థాయికి అతను చేరుకున్నాడు.

**వచనము 18**. అంతా అగమ్యగోచరంగా ఉన్న ఆ దీనావస్థకు ఆవల ఇష్మాయేలుకున్న భవిష్యత్‌జీవితంగురించి హాగరు గ్రహించేలా దేవుని దూత ఆమెకు విశదపరుస్తున్నాడు. ఆ **చిన్నవాని లేవనెత్తి నీ చేత పట్టుకొనుము** అని దేవుని దూత ఆమెను హెచ్చరించాడు. "అతనిమీద నీ చేతిని స్థిరంగా ఉంచుము" అని ఈ మాటలకు అక్షరార్థం. హెబ్రీ నుడికారంలో "అతనికి నీ ప్రోత్సాహాన్నివ్వు"[10] అని అర్థం. అప్పుడు ఆ దివ్యస్వరం చాలా కాలం క్రిందట యెహోవా దూత ఆమెతో చేసిన వాగ్దానాన్ని పునరుద్ఘాటించింది. ఆమె కుమారుడైన ఇష్మాయేలును **గొప్ప జనముగా** చేసెదనని దేవుడు ఈ సమయంలో చాలా స్పష్టంగా నిర్దేశించాడు (16:10–12 చూడండి).

**వచనము 19**. భవిష్యత్తులో ఇష్మాయేలుకు కలిగే ఆశీర్వాదాలపట్ల యెహోవా ఆసక్తి చూపడం మాత్రమే కాదు, ఆయన ఇష్మాయేలు ప్రస్తుత పరిస్థితిని, అంటే తిత్తిలోని నీళ్లు పూర్తిగా అయిపోయి నందువలన అతని శరీరం ఎండవేడిమికి తాళలేక వడలిపోవడంపట్ల కూడా తన దృష్టిపెట్టాడు. ఆమె పెట్టిన మొరకు జవాబుగా, **దేవుడు ఆమె** (హాగరు) **కన్నులు తెరచినందున ఆమె నీళ్ల ఊట చూచినట్టు** తెలుస్తోంది. అప్పుడు వారు "బెయేర్షెబా అరణ్యములో" ఉన్నారు, బావి ఎప్పటినుండో అక్కడే ఉంది (21:14 వివరణలు చూడండి). ఏమైనప్పటికీ, ఇక తనకు నీరు దొరికే వీలు లేదని నిరాశపడింది, కళ్లనిండా కన్నీరు ఉబికి రాగా అక్కడే ఉన్న బావిని ఆమె చూడలేకపోయింది. ఈ విషయంలో దేవుని దూత ఇక హాగరుకు విడమర్చి చెప్ప నవసరం రాలేదు; **ఆమె ... వెళ్లి ఆ తిత్తిని నీళ్లతో నింపి చిన్నవానికి త్రాగ నిచ్చెను** అని తెలుస్తోంది. ఆమె తన దాహంతీర్చుకున్న విషయం ఈ వర్ణనలో ప్రస్తావనకు రాలేదు; వాస్తవానికి ఒక తల్లిగా వాస్తవానికి ఒక తల్లిగా తన కుమారునికి నీటినివ్వడం ఆమె ముందున్న ముఖ్యమైన బాధ్యత అని ఈ వర్ణన విశదపరుస్తోంది. ఇష్మాయేలు నీళ్లు త్రాగి సేదదీరిన తర్వాత ఆమె నీళ్లు త్రాగి తన ప్రాణం నిలబెట్టుకొని ఉంటుందనే సంగతి సుస్పష్టమైనదే.

**వచనము 20**. బెయేర్షెబా దగ్గర ఉన్న అరణ్యంలో హాగరుకు ఇష్మాయేలుకు ఎదురైన ఆకస్మిక అనుభవం తర్వాత, ఈ పిల్లవాడి జీవితంలో తదుపరి భాగం గురించి రచయిత చాలా క్లుప్తంగా సంగ్రహపర్చాడు. అతను **జనవాసాలకు దూరంగా అరణ్యములో కాపురముండినట్టు**, "అడవిగాడి దవంటి మనుష్యుడు" అయ్యేవరకు (16:12) **దేవుడు ఆ చిన్నవానికి** తోడై యుండెను అనీ తెలుస్తోంది. ఇష్మాయేలు సంచార జీవనవిధానాన్ని కోరుకోవడంతో, అతను విలుకాడాయెను అని తెలుస్తోంది. వేటగాడిగా అతను మంచి నేర్పరితనాన్ని సాధించి ఉండవచ్చు, ప్రతికూలమైన పరిస్థితుల్లో అతను బ్రతకడానికి ఇది తోడ్పడి ఉంటుంది. తదుపరి

కాలంలో అతని వంశస్థుల్లో కొందరైన "కేదారీయుల" గురించి వారు "విలు కాండ్లు" మరియు "బలాఢ్యులు" అనే ప్రస్తావన కనబడుతోంది (యెష. 21:17; మరియు ఆది. 25:12, 13 చూడండి).

**వచనము 21**. ఈ వృత్తాంతంలో చివరిసారిగా ఇష్మాయేలు గురించి అతను **పారాను అరణ్యములో నున్నట్టుగా** సంక్షిప్త సమాచారం కనబడుతోంది, ఈ అరణ్యం కనాను దక్షిణప్రాంతంనుండి సీనాయి ద్వీప కల్పం తూర్పు మధ్య ప్రాంతంలో చాలా మేరకు మరియు దిగువగా ఎర్ర సముద్రంవరకు వ్యాపించింది (అరాబా సింధు శాఖ) (సంఖ్యా. 12:16; 13:3, 26). హాగరు ఐగుప్తీయురాలు గనక (16:1, 3; 21:9; 25:12), ఇష్మాయేలు ఆమె స్వదేశానికి చాలా దగ్గర్లో నివసించాడు గనక, ఆమె తన కుమారునికి **ఐగుప్తు దేశము నుండి ఒక స్త్రీని** తెచ్చి అతనికి పెండ్లి చేసింది. ప్రాచీన పశ్చిమాసియా సంప్రదాయాల ప్రకారం, తండ్రి తన కుమారునికి భార్యను తీసుకురావాలి (24:1–67; 34:4). అబ్రాహాము హాగరును పంపించి వేశాడు గనక, ఈ విషయంలో ఇది సాధ్యం కాదు. కాబట్టి ఆమె, ఆచారం ప్రకారం తన భర్త చేయవలసిన బాధ్యతను తానే తీసుకుంది. బహుశా ఆమె పారాను అరణ్యంగుండా ప్రయాణించే వర్తకులైన బాటసారుల బృందంలోంచి ఐగప్తు బానిసను తెచ్చి ఉండవచ్చు (37:28 చూడండి).

## అబ్రాహాము అబీమెలెకుతో ఒప్పందం చేయడం (21:22–34)

కథాగమనం మళ్లీ అబ్రాహామువైపు మళ్లింది, అతను అబీమెలెకుతో ఒప్పందం కుదుర్చు కున్నట్టు కనబడుతోంది.

### ఒప్పందం (21:22–26)

**22ఆ కాలమందు అబీమెలెకును అతని సేనాధిపతియైన ఫీకోలును అబ్రాహాముతో మాటలాడి–నీవు చేయు పనులన్నిటిలోను దేవుడు నీకు తోడైయున్నాడు గనుక 23నీవు నన్నైనను నా పుత్ర పౌత్రాదులనైనను వంచింపక, నేను నీకు చేసిన ఉపకారము చొప్పున నాకును నీవు పరదేశివైయున్న యీ దేశమునకు చేసెదనని దేవుని పేరట ఇక్కడ నాతో ప్రమాణము చేయుమని చెప్పెను. 24అందుకు అబ్రాహాము – ప్రమాణము చేసెదననెను. 25–26అబీమెలెకు దాసులు బలాత్కారముగా తీసికొనిన నీళ్ల బావి విషయమై అబ్రాహాము అబీమెలెకును ఆక్షేపింపగా అబీమెలెకు–ఈ పని యెవరు చేసిరో నేనెరుగను; నీవును నాతో చెప్పలేదు; నేను నేడే గాని యీ సంగతి వినలేదని చెప్పగా**

**వచనము 22**. లేఖనభాగం తెలియజేస్తున్నట్టుగా, ఈ సంఘటన **ఆ కాలమందు** జరిగింది. ఇక్కడ సహజంగానే "ఏ కాలంలో" అనే ప్రశ్న తలెత్తుతుంది.

ఈ సందర్భం ఇస్సాకు పుట్టక మునుపు (21:1–3), శారా విషయంలో అబ్రాహాము అబీమెలెకుతో అబద్ధం చెప్పినప్పటిదనీ (20:1–18) ఆదికాండము రచయిత గతంలోని సంఘటన గురించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాడని కొందరి పండితుల అభిప్రాయం. ఈ అభిప్రాయం సంభావ్యమైనదే అయినప్పటికీ, “ఆ కాలమందు” అనే పదచిత్రం (భావప్రకటన) చాలా మటుకు కాల క్రమానుగత సంఘటనల్నే పేర్కొంటున్నట్టుగా ఉంది. అదీగాక, ఇస్సాకు పుట్టి తల్లిపాలు విడిచిన తర్వాతనే మరియు హాగరును ఇష్మాయేలును బయటికి పంపించిన తర్వాతనే, అబ్రాహాము అబీమెలెకుల మధ్య ఒప్పందం జరిగింది (21:1–21).

ఈ సందర్భంలో, **అబీమెలెకు** తన సేనాధిపతియైన ఫీకోలును వెంట తెచ్చుకున్నాడు. “ఫీకోలు” అనే పేరు యొక్క మూలం అనిశ్చయము. కొందరు ఈ పేరులో హురియన్[11], అనటోలియన్[12], లేక ఫిలిష్తీ మూలం ఉందనీ (21:32, 34; 26:1, 26) గుర్తించినప్పటికీ, ఈ పేరు ప్రాచీన గ్రంథాల్లో గానీ శిలాశాసనాల్లో గానీ ఎక్కడా కనబడడంలేదు. హురియన్ ప్రజలు ఆ కాలంలో మెసొపొతమియ వాయవ్యప్రాంతం (ఇరాక్) నుండి అనటోలియా (టర్కీ) లోకి విస్తరించి ఉన్నందున,[13] ఫిలిష్తీయుల్లో అనేకుల స్వస్థలమైన “ఎజియన్ లేక అనటోలియా ప్రాంతం నుండి క్రేతు గుండా” బహుశా ఫీకోలు పూర్వికులు వచ్చి ఉంటారేమోనని (“కఫ్తోరు”; ఆమోసు 9:7) Gordon J. Wenham అనే పండితుని ఊహాజనిత అభిప్రాయం.[14]

అబీమెలెకు మరియు ఫీకోలు అబ్రాహామును **నీవు చేయు పనులన్నిటిలోను దేవుడు నీకు తోడైయున్నాడు** అని ప్రశంసించారు. దినదినాభివృద్ధి చెందుతున్న అబ్రాహాము ఐశ్వర్యాన్ని పురోగతిని మరీ ముఖ్యంగా విస్తారమైన గొర్రెలు మేకలు పశువుల మందల్ని వీరు చాలా సంవత్సరాలుగా గమనించారు. అంత విస్తారమైన మందల్ని కాపాడడంకొరకు సుశిక్షితులైన కాపరులు కావాలి. గతంలోనే సుశిక్షితులైన మూడువందల పద్దెనిమిది మంది మనుషులు సుమారు ఇరవై అయిదు సంవత్సరాలకు పైగానే అబ్రాహామును సేవించడం జరిగింది (14:14), ఇప్పటికి అబ్రాహాము దగ్గర అంతకు రెట్టింపు మనుషులుండవచ్చు. అబ్రాహాముతో ఉన్న విస్తారమైన అనుచరగణం తమకు రాజకీయంగా బెడదగా మారగలదేమోనని బహుశా అబీమెలెకు అతని సేనాధిపతి చూచి ఉండవచ్చు.

కాబట్టి, ఫిలిష్తీయులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. “దేవుడు” (אֱלֹהִים, *’Elohim*) **పితరునికి తోడుగా ఉన్నాడని**, అతను చేసిన పని అంతటినీ దేవుడు ఆశీర్వదిస్తున్నాడనే గొప్ప ప్రశంసతో వారు తమ సంభాషణను మొదలుపెట్టారు. ఆదికాండములో దేవునికి సర్వవ్యాప్త నామంగాను, అన్య ప్రజలు దేవునికి ఉపయోగించిన ప్రామాణిక నామంగాను, అంటే ఏ దైవానికైనా వర్తించే సర్వసాధారణమైన వర్గ నామంగాను *’Elohim* అనే పేరు కనబడుతోంది (31:30; 41:38). అబ్రాహాము మనుషులకు తన మనుషులకు మధ్య ఉద్రిక్తతల్ని లేక

ప్రతికూల చర్యల్ని నివారించడంకొరకు, ధనవంతుడూ శక్తిమంతుడూ అయిన పరదేశినుండి (అబ్రాహాము) ఏ దాడి ఎదురుకాకుండా అతనితో అబీమెలెకు శాంతి ఒడంబడిక చేసుకోవాలనుకున్నాడు.

ఈ ఇద్దరూ మొదటిసారిగా కలుసుకున్న చాలా సంవత్సరాల తర్వాతనే వీరి మధ్య ఇప్పుడు ఈ సమావేశం జరిగి ఉండవచ్చు (20:1–18), ఎందుకంటే మొదట ఉన్న పరిస్థితులు ఇప్పుడు తలక్రిందు లైనట్టుగా కనబడుతోంది. మొదట్లో, అబ్రాహాము అబీమెలెకు విషయంలో తనకు ప్రాణహాని ఉందేమోనని భయపడ్డాడు. ఈ భయమే అతను శారా విషయంలో అబద్ధం చెప్పేటట్టు, రాజు ఆమెను తీసుకొని వెళ్లే టట్టుగాను చేసింది. అయితే ఇప్పుడు, పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. దేవుని ఆశీర్వాదాలతో పితరుని సంపాద్యాలు అధికం కావడంతోను అతని మనుషులు రెట్టింపవడంతోను (21:22), రాజు తన దేశంలో ఉన్న పరదేశిని చూచి బెదిరిపోతున్నాడు.

**వచనము 23**. కాబట్టి, అబీమెలెకు తన సేనాధిపతితోబాటు వచ్చి అబ్రాహాముతో మైత్రీబంధాన్ని కోరుకుంటున్నాడు. తననుగానీ తన పుత్ర పౌత్రాదులనుగానీ అబ్రాహాము వంచింపకుండా ఉండేలా అతను **దేవుని పేరట ... ప్రమాణము చేయాలని** అబీమెలెకు మనవి చేస్తున్నాడు. అంటే, ఇక ఎన్నటికీ అబ్రాహాము తన **ప్రజలమీద దాడిచేయకుండా**, తనను గానీ తన **భావితరాలవారినిగానీ** పదవీభ్రష్టుల్ని చేసి వంచనతో రాజ్యాన్ని ఆక్రమించుకొనకుండా అబీమెలెకు అబ్రాహాముతో నిబంధనను కోరుకుంటున్నాడు. అబీమెలెకు అబ్రాహాము కెటువంటి ఉపకారము (חֶסֶד, *chesed*, "నమ్మకత్వము" లేక "అపార ప్రేమ") చేశాడో, అటువంటి **ఉపకారాన్నే** ఇప్పుడు అబ్రాహాము తాను **పరదేశిగా ఉన్న** (גּוּר, *gur*, "పరదేశిగా జీవించాడు") యీ **దేశమునకు** కూడా చేయాలని అతనిప్పుడు అభ్యర్థిస్తున్నాడు.

**వచనము 24**. అంతఃకరణ ప్రేరణతోనే **అబ్రాహాము ప్రమాణము చేసెదను** అని చెప్పాడు. అబ్రాహాము ప్రమాణంచేయడం గురించి మాత్రమే మనం చదువుతున్నప్పటికీ, ఎదురుదాడులు జరగ కుండా చేసుకొనే ఈ మైత్రీపూర్వక నిబంధనలోని షరతులకు చట్టప్రకారం రెండు పక్షాలు బాధ్యత వహించాలనేది మనకు తెలిసిన విషయమే. కాబట్టి, ఈ ఒప్పందాన్ని లేక సంధిని కుదుర్చుకోడంలో చివరగా వారిద్దరు ఒప్పందం పట్ల విశ్వసనీయత కనపర్చేలా "ప్రమాణము చేసి" కొన్నారని (21:31) రచయిత ప్రస్తావిస్తు న్నాడు. నిబంధన విషయంలో ఈ ప్రస్తావన ఇంతకు ముందు రాకపోవడం బహుశా నిబంధనను కోరుకొనే వ్యక్తికి నిబంధన పట్ల విశ్వసనీయత ఉండడం అవశ్యం అనే భావన కావచ్చు. అబ్రాహాము అబీమెలెకుతో ఇటువంటి ఒప్పందం కుదుర్చుకుంటాడా కుదుర్చుకొనడా అనేదే ఇక్కడ అసలు ప్రశ్న. అబ్రాహాము ఒప్పుకున్న వెంటనే నిబంధన విషయంలో జరగవలసిన విధినిర్వహణ జరిగిపోయింది.

**వచనములు 25**. ఈ ఇద్దరు ఒప్పందాన్ని లేక నిబంధనను రూఢిపర్చుకొనేముందు (ఆమోదించే ముందు), **అబ్రాహాము** ఒక తనకెదురైన ఒక ఇబ్బంది గురించి తప్పక చెప్పవలసిన అవసరం కలిగింది. అతని మనుషులు నీళ్ల బావి త్రవ్వగా (26:15, 18 చూడండి) ఆ **బావిని అబీమెలెకు దాసులు బలాత్కారముగా తీసికొనిన** సంగతి గురించి అబ్రాహాము **అబీమెలెకును ఆక్షేపించాడు**. అప్పటికే అబ్రాహాము రాజుపట్ల అతని ప్రజలపట్ల "ఉపకారము" (*chesed*) చేస్తానని ప్రమాణంచేసినందువలన (21:23, 24), అతను తన ప్రమాణం మీరకుండా అబీమెలెకు దాసుల నేరపూరిత చర్యల్ని శిక్షించలేడు. కాబట్టి, అబ్రాహాముకున్న ఏకైక మార్గం లేక అవశ్యమైన శరణ్యం ఏమిటంటే ఈ విషయంలో న్యాయం కొరకు రాజుకు విజ్ఞప్తి చేయడం మాత్రమే.

**వచనము 26**. బలాత్కారంగా బావిని తీసుకొంటే పితరుడు ఫిర్యాదు చేయడమనేది నేటి కాలంలో మనకు అంత తీవ్రమైన నేరంగా కనిపించకపోయినా, పితరుని కాలంలో అక్కడక్కడా మాత్రమే కొద్దిపాటి నీటివసతి లభ్యమయ్యే శుష్కభూముల్లో ప్రజలకు పశువుల మందలకు అది జీవన్మరణ సమస్యయే. అతనికి నీటిమీద హక్కు లేనట్లయితే, **అబీమెలెకు** ఎదుట అబ్రాహాము శాంతియుతంగా నివసించే విషయంలో చేసిన ప్రమాణానికి ఏం విలువ ఉంటుంది?

ఈ విషయం క్రొత్తగా కుదుర్చుకున్న నిబంధనకు (ఒప్పందానికి) మంచి పరీక్ష అవుతుంది. రాజు తన పట్ల న్యాయంగా ప్రవర్తిస్తాడో ప్రవర్తించడో, తన సేవకులు చేసిన తప్పుల్ని సరిదిద్దుతాడో సరిదిద్దడో అబ్రాహాము తెలుసుకోవాలనుకున్నాడు. అదీగాక, అబీమెలెకు అతనిని అతనితోబాటు ఉన్నవారందరినీ ఆ ప్రాంతంలో నివసించడానికి ముందుగా ఆహ్వానించాడు (20:15). వారు (అబ్రాహాము, అతని మనుషులు) ఆ భూమిని భూమిలో లభ్యమయ్యే నీటిని వాడుకొనవచ్చనే అంతర్భావం సహజంగానే, అంటే చెప్పనక్కర్లేకుండనే కనబడుతోంది. **రాజు ఈ విషయంలో తనకేమీ తెలియదన్నట్టుగా** ఈ పని యెవరు చేసిరో అని చెప్పాడు. పైపెచ్చు, ఈ విషయం గురించి తనకెందుకు చెప్పలేదని ఇంకా అబ్రాహామునే నిందిస్తున్నాడు. నేను **నేడే గాని యీ సంగతి** వినలేదని అబీమెలెకు నొక్కి చెబుతున్నాడు.

## ఒప్పందం ఆమోదం పొందడం (21:27–34)

**[27]అబ్రాహాము గొఱ్ఱెలను గొడ్లను తెప్పించి అబీమెలెకుకిచ్చెను. వారిద్దరు ఇట్లు నిబంధన చేసి కొనిరి. [28]తరువాత అబ్రాహాము తన గొఱ్ఱెల మందలోనుండి యేడు పెంటి పిల్లలను వేరుగా నుంచెను గనుక [29]అబీమెలెకు అబ్రాహాముతో–నీవు వేరుగా ఉంచిన ఆ యేడు గొఱ్ఱె పిల్లలు ఎందుకని యడిగెను. అందు కతడు [30]–నేనే యీ బావిని త్రవ్వించినందుకు నా సాక్ష్యార్థముగా ఈ యేడు గొఱ్ఱె పిల్లలను నీవు నా చేత**

**పుచ్చుకొనవలెనని చెప్పెను. [31]అక్కడ వారిద్దరు అట్లు ప్రమాణము చేసికొనినందున ఆ చోటు బెయేర్షెబా అనబడెను. [32]బెయేర్షెబాలో వారు ఆలాగు ఒక నిబంధన చేసికొనిన తరువాత అబీమెలెకు లేచి తన సేనాధిపతియైన ఫీకోలుతో ఫిలిష్తీయుల దేశమునకు తిరిగి వెళ్లెను. [33]అబ్రాహాము బెయేర్షెబాలో ఒక పిచుల వృక్షము నాటి అక్కడ నిత్యదేవుడైన యెహోవా పేరట ప్రార్థన చేసెను. [34]అబ్రాహాము ఫిలిష్తీయుల దేశములో అనేక దినములు పరదేశిగా నుండెను.**

**వచనము 27.** అబ్రాహాము త్రవ్వించిన బావిని అబీమెలెకు సేవకులు బలవంతంగా తీసుకున్న సంగతి అబీమెలెకుకు తెలిసినప్పటికీ అతను తెలియదని చెప్పినప్పుడు చివరకి ఆ విషయాన్ని అబ్రాహాము నమ్మడం జరిగింది. ఈ వివాదం విషయంలో ఫలితమేమైందో వాక్యభాగంలో వివరాలు లభ్యం కాక పోయినా, పితరుని ఫిర్యాదు గురించి దర్యాప్తు చేయడానికి రాజు అంగీకరించి ఉండవచ్చు. రాజు అబ్రాహాము విషయంలో జరిగిన తప్పును సరిదిద్దుతాననే అభయాన్నిచ్చేవరకు బహుశా అబ్రాహాము శాంతి ఒప్పందాన్ని ఆమోదించి ఉండక పోవచ్చు. వివాదం శాంతియుతంగా పరిష్కారమవుతుందనే మెప్పుకోలుతో, పితరుడు గొఱ్ఱెలను **గొడ్లను తెప్పించి అబీమెలెకుకిచ్చెను అని మనకు విశదమవుతోంది.**

సత్సంబంధాల పునరుద్ధరణతో, పరస్పర విధ్యుక్త ధర్మాల్ని అంగీకరిస్తూ వారిద్దరు ఇట్లు నిబంధన చేసికొనిరి అని ఉంది. “నిబంధన చేసికొనిరి” అనే హెబ్రీ భావోక్తికి “నిబంధనను ఖండించడం” (כָּרַת בְּרִית, *karath $b^e$rith*) అని వ్యాఖ్యార్థం. ఇది, నిబంధన చేసుకున్న సందర్భంలో పశువును రెండు ఖండాలుగా వధించి ఆ రెండు ఖండాల మధ్య నడిచిపోయే (15:7–11, 17, 18) ప్రాచీన కాలంలోని ఆచారాన్ని సూచిస్తుండవచ్చు. నిబంధనచేసు కున్నవారు నిబంధనలోని విధ్యుక్త ధర్మాల్ని పాటించక పోయినట్లయితే “ఆ పశువుకు జరిగినట్లే తమకు కూడా జరుగుతుంది”[15] అని తమ మీదికి తామే శాపోక్తిని తెచ్చుకున్నట్లని అర్థం.

**వచనము 28.** వాక్యభాగం **అబ్రాహాము తన గొఱ్ఱెల మందలోనుండి యేడు పెంటి పిల్లలను వేరుగా నుంచెను** అని తెలియజేస్తోంది. వారిద్దరూ ఖండించిన పశువులుగాక అబ్రాహాము ఏడు గొర్రెపిల్లల్ని వేరుగా ఉంచాడని స్పష్టమవుతోంది. ఈ సమయంలో ఆచారరీత్యా చేయవలసినదానికంటె మించినదేదో అబ్రాహాము చేసిన ఈ చర్యలో కనబడుతోంది, ఇదేమిటో అబీమెలెకుకు కూడా అర్థంకాక కలవరపడ్డాడు.

**వచనము 29.** అదనంగా గొర్రెపిల్లల్ని ఉంచడంలోని ప్రాముఖ్యత స్వయంవివరణాత్మకంగా లేదు కాబట్టి, రాజు వాటిని స్వీకరించడానికి సుముఖత చూపలేదు. **నీవు వేరుగా ఉంచిన ఆ యేడు గొఱ్ఱె పిల్లలు ఎందుకని అడిగి రాజు అబ్రాహామును** వివరణ కోరడం జరిగింది.

**వచనము 30**. అబ్రాహాము తన ఉద్దేశాలగురించి తన చర్యలగురించి నేనే **యీ బావిని త్రవ్వించి నందుకు నా సాక్ష్యార్థముగా ఈ యేడు గొఱ్ఱె పిల్లలను నీవు నా చేత పుచ్చుకొనవలెనని** రాజుకు వివరించి చెప్పాడు. అబ్రాహాము నీళ్లబావిమీద హక్కు విషయంలో ఎదురుదాడులకు వీల్లేని శాంతియుత ఒప్పందంలో భాగమైన భద్రతకు మించినదాన్ని లేక మౌఖికమైన వాగ్దానానికి మించినదాన్ని ఏదో అబీమెలెకునుండి కోరుకుంటున్నాడు; నీళ్లబావిని అబ్రాహాము మనుషులే త్రవ్వారు కాబట్టి ఆ నీళ్లబావి తనకే చెందుతుందని అతను రాజునుండి బహిరంగ ప్రమాణాన్ని లేక ఒట్టును కోరుకుంటున్నాడు.

**వచనము 31**. అబ్రాహాము అబీమెలెకుతో రెండవ ప్రతిఘటన గురించిన వర్ణన అక్కడ **వారిద్దరు అట్లు ప్రమాణము చేసికొనినందున** ఆ చోటు బెయేర్షెబా అనబడెను అనే వ్యాఖ్యతో ముగుస్తుంది. "నీళ్ల బావి" విషయానికి తోడు (21:25–26, 30), "నిబంధన" "యేడు" "ప్రమాణము" అనేవాటిని ఈ వాక్య భాగంలో పలుసార్లు సూచించడం జరిగింది (21:23, 24, 28, 29, 31). ఇక్కడ ఉపయోగించిన పదాల ప్రాముఖ్యతను రచయిత వివరించాడు: בְּאֵר (*b*$^{e}$*'er*) అంటే "బావి" అనీ, שֶׁבַע (*sheba'*) అంటే "యేడు" అని సూచ్యార్థం. ఈ రెండు పదాల కూటమికి అక్షరాలా "యేడు యొక్క బావి" అని అర్థం, ఇది పితరుడు రాజుకు ఏడు గొర్రెపిల్లల్ని ఇవ్వడాన్ని సూచిస్తోంది. వీరిద్దరూ ప్రమాణం చేసుకున్న ఈ స్థలానికి స్మారక చిహ్నంగా "ప్రమాణము యొక్క బావి" అనే అర్థం కూడా ఈ పేరులో ఉంది.[16]

సుమారు ఇరవై అయిదు సంవత్సరాలకు పైగానే కనానులో నివసించిన తర్వాత, అక్కడున్న బావుల్లో కనీసం ఒక బావి మీదైనా అతనికి చట్టప్రకారం పూర్తి హక్కు ఉండాలి. నేడు టెల్ బెయేర్షెబా అని పేరుపొందిన ప్రాంతంలో (నాటి బెయేర్షెబా) సుమారు రెండు మైళ్ల పరిధిలోపే అనేక బావుల్ని కనుక్కోడం జరిగింది, పైగా ఈ బావులు ఏ కాలం నాటివో చెప్పడం కష్టం కాబట్టి అబ్రాహాము త్రవ్వించిన బావి కచ్చితంగా ఎక్కడుందో వివాదాస్పదంగా కనబడుతుంది. పైపెచ్చు, నేటి టెల్ బెయేర్షెబా పితరుల కాలం నాటి బెయేర్షెబానేనని కచ్చితంగా తెలియడం లేదు.[17] భూకంపాలు, యుద్ధం మూలంగా వినాశనం, బావుల్లో నీటి ఊటల్లో నీరు ఇంకిపోయి ఎండిపోవడం ఇంకా తదితర కారణాల మూలంగా విపత్తులు ఎదురైనప్పుడు ప్రాచీన కాలంలో కొన్నిసార్లు ప్రజలు ఆ యా స్థలాల్ని విడిచిపెట్టి వెళ్లిపోవడం జరిగేది. అలా వెళ్లిపోయిన ఆ ప్రాంతవాసులు తాము వెళ్లిన క్రొత్త ప్రదేశాలకు ఇదివరకు తాము ఉండి వచ్చిన పట్టణాల పేర్లను పెట్టుకొనేవారు. పురావస్తు శాస్త్రజ్ఞులు ప్రాచీనకాలంనాటి "స్థానభ్రంశ"మైన ఇటువంటి అనేక ప్రదేశాల్ని అనేకం కనుగొన్నారు.

**వచనము 32**. విజయవంతంగా **బెయేర్షెబాలో వారు** ఆలాగు **ఒక నిబంధన చేసికొనిన** అనంతరం **అబీమెలెకు ఫీకోలు తమ ఫిలిష్తీయుల దేశమునకు** తిరిగి వెళ్లారు. ఈ ప్రస్తావన ద్వారా వారి అధీనంలో లేక ప్రత్యక్ష నియంత్రణ క్రింద

బెయేర్షెబా లేదని తెలుస్తోంది; అయితే ఇది వారి సరిహద్దుకు ఆనుకొని ఉందేమో నని, అందువలన ఎంతో కొంత మేరకు దీనిమీద కూడా వారికి హక్కు ఉందనీ, అక్కడ నివసిస్తున్న శక్తి గల ఆస్తిపరుడైన అబ్రాహాముతో శాంతియుతమైన సంబంధాల్ని వారు కోరుకుంటున్నారనీ స్పష్టమవుతోంది.

కొందరు విమర్శకులు (గ్రంథ నిపుణులు) అబీమెలెకు ఫీకోలు మరియు గెరారులోని ఫిలిష్తీయులకు సంబంధించిన ఈ వృత్తాంతాన్ని సందేహాస్పదంగా పరిగణిస్తుంటారు. క్రీస్తు పూర్వం 1200 వరకు కనానులోకి ఫిలిష్తీయుల రాక గానీ కనానులో వారి సంఖ్యగానీ అంత విస్తారమైనదిగా లేక గణనీయమైనదిగా ఉండేదనడానికి ఏ రుజువు లేకపోవడాన్నిబట్టి ఫిలిష్తీయులకు సంబంధించిన ఏ విషయాన్నైనా తద్భిన్నకాలానికి చెందినదాన్నిగా అంటే అబ్రాహాము కాలంనాటికి సమన్వయం లేనిదాన్నిగా విమర్శకులు (గ్రంథ నిపుణులు) సూచిస్తున్నారు. ఏమైనప్పటికీ, పురావస్తు శాస్త్రజ్ఞులు క్రేతు ద్వీపం ("కఫ్తోరు"; ఆమోసు 9:7) ఐగుప్తు కనాను సిరియా మెసొపొతమియ మొదలైన ప్రాంతాల మధ్య విస్తృతమైన వాణిజ్య సంబంధాలుండేవనీ, విశేషించి క్రేతులో లభ్యమయ్యే భిత్తి చిత్రాలు (frescoes), మృణ్మయ పాత్రలు, పితరుల కాలంనాటి పానపాత్రలు (chalice) మొదలైనవి వర్తకపు సరుకుల్లో ఉండేవని తెలుస్తోంది.[18] దీన్నే గనక పరిగణనలోకి తీసుకున్నట్లయితే ఆదికాండములోని ఫిలిష్తీయులు తొలివిడతగా కనానులోకి వచ్చి ఉంటారనే అభిప్రాయాన్ని కాదనేందుకు గానీ, మరియు తదుపరి కాలంలో ఫిలిష్తీయులు విస్తృత సంఖ్యలో కనానులోకి వచ్చి ఆక్రమించుకొని ఉండవచ్చే అభిప్రాయాన్ని కాదనేందుకు సరైన హేతువేమీ కనబడడంలేదు.

పైగా, తొలుత కనానులో ఉన్న ఫిలిష్తీయులకు తదుపరి కాలంనాటి ఫిలిష్తీయులకు రాజకీయ పరమైన వ్యత్యాసాలున్నాయి. అబ్రాహాము ఎవరితో ప్రమాణంచేశాడో ఆ ఫిలిష్తీయులు శాంతిప్రియులు, అంతే కాదు క్రొత్తవారి పట్ల (పరదేశుల పట్ల) వ్యవహారదక్షతతో ప్రవర్తించేవారు; వీరు రాజు పాలనక్రింద గెరారులో నివసించారు. వీరికి భిన్నంగా, తదుపరి కాలంనాటి ఫిలిష్తీయులు యుద్ధతత్పరత గల యోధులు; వీరు, గాజా అష్డోదు అష్కెలోను గాతు మరియు ఎక్రోను అనే అయిదు పట్టణాల రాజకీయ కూటమిని స్థాపించారు–వాటిని అయిదుగురు నాయకులు పరిపాలించారు (యెహో. 13:3; న్యాయాధి. 3:3; 1 సమూ. 6:16–18).[19] న్యాయాధిపతుల కాలంలోను మరియు సౌలు పరిపాలనాకాలం లోను చాలా కాలం ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయుల చేతుల్లో శ్రమలనుభవించారు. దావీదు రాజ్యపరిపాలన చేపట్టిన చాలా కాలం తర్వాతనే అతని సైన్యం ఫిలిష్తీయుల్ని అణచివేయడం జరగింది (2 సమూ. 8:1; 1 దిన. 18:1).

**వచనము 33**. ఇప్పుడిక ఇరు పక్షాల మధ్య నిబంధన ఆమోదం పొంది స్థిరపడింది గనక, అబీమెలెకు మరియు ఫీకోలు గెరారుకు తిరిగి వెళ్లారు. పితరుడు

అక్కడే ఉండి, **బెయేర్షెబాలో ఒక పిచుల వృక్షము నాటినాడని** తెలుస్తోంది. నెగెబులోని దక్షిణ ప్రాంతంలో నీడ నిచ్చే చెట్లల్లో పిచుల వృక్షాలు చాలా ముఖ్యమైనవి, పైగా ఇవి నీళ్లు అరుదుగా లభ్యమయ్యే శుష్కభూములకు తగిన చెట్లు. పిచుల వృక్షాల్ని నాటడం ఎడారివాసులకు అలవాటుగా వస్తోంది; ఇవి సుమారు ఇరవై లేక ముప్పయి అడుగుల ఎత్తు మేరకు పెరిగి చల్లటి నీడ నిస్తాయి. పైగా ఇవి గొర్రెల కాపరులకు అదనపు లాభాన్నిస్తాయి, ఎందుకంటే గొర్రెల మందలు ఈ వృక్షాల దిగువనున్న కొమ్మలకుండే లేత చిగురాకుల్ని ఇష్టంగా తింటాయి.[20]

పాత నిబంధన కాలంలో, వృక్షాలు—మరీ ముఖ్యంగా సతతహరిత వృక్షాలు—జీవానికి ఫలసిద్ధికి దేవుని దీవెనలకు ప్రతీకాత్మకంగా ఉండేవి (2:9; 13:10; కీర్తన. 1:3; యిర్మీయా 17:7, 8; యెహెజ్కేలు 47:12). కొందరి అభిప్రాయం ప్రకారం, పితరుడు దేవుని ఆరాధించడంకొరకు పిచుల వృక్షాన్ని నాటడం, బలిపీఠాన్ని నిర్మించడానికి సాదృశ్యంగా ఉంది. ప్రాచీన కనానీయులు వృక్షాల్ని స్తంభాల్ని బలిపీఠాల్ని తమ ఆరాధనల్లో ఉపయోగించేవారు, అయితే ఈ అలవాటు క్రమేపీ ప్రజననశక్తి కొరకు (ఫలన సామర్థ్యం, సంతాన సాఫల్యం) చేసే ఆచారంగా అధఃపతనంవైపు దిగజారిపోయింది. తర్వాత, ఇశ్రాయేలీయుల్లో అన్య ప్రజల్ని అనుకరించే ధోరణి ఉన్నందున, పవిత్ర వృక్షాలుగా పరిగణన పొందిన వీటిని పూజించడాన్ని మోషే ధర్మశాస్త్రం యెహోవా ఆరాధనలో నిషేధించింది (ద్వితీ. 16:21). అబ్రాహాము కనానీయుల పుణ్య క్షేత్రాలవైపు ఎన్నడూ వెళ్లనే లేదు, పైగా వాటిని వర్జించాడు (తృణీకరించాడు) కాబట్టి, దేవుని ఆరాధించడం కొరకు అతను స్వంతంగా బలిపీఠాల్ని నిర్మించుకున్నాడు. అయితే ఫలన సామర్థ్యం కొరకు వృక్షాల్ని ఆరాధించడానికి సంబంధించిన క్రతువులేవీ అబ్రాహాముకు తెలిసి ఉండకపోవచ్చు. అబ్రాహాముకు ఈ అలవాట్లు ఆచారాలు తెలిసి ఉండకపోయినా, దైవారాధనకు సంబంధించిన ఎటువంటి ప్రాముఖ్యతను అతను ఈ వృక్షాన్ని నాటడానికి ఆపాదించలేదు. క్రమేపీ ఆ వృక్షం పెరిగి పెద్దదై అతను యెహోవాను ఆరాధించడంకొరకు అతనికి చల్లని నీడ నిచ్చింది.

దేశంలో అబ్రాహాము కోరుకున్న ఏ ప్రాంతంలోనైనా అతను నివసించడానికి అబీమెలెకు అనుమతి నిచ్చాడని (20:15), ఈ వృత్తాంతం గురించి మరో వివరణ పరిగణనలో ఉంది. ఈ ఇద్దరూ బెయేర్షెబా దగ్గర శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకొని ప్రమాణం చేయడంతో ఇది అబ్రాహాముకు చెందిన ఆస్తిగా గుర్తింపు పొందింది. తన మందలకు మేతస్థలంగాను తన పరివార జనానికి విశ్రమస్థానంగాను హక్కు ఉండేలా బహుశా అక్కడ అబ్రాహాము ఈ వృక్షాన్ని నాటి ఉండవచ్చు.

ఈ వివరణలో ఉన్న జటిల సమస్య ఏమిటంటే, పితరునికి అబీమెలెకుకు మధ్య కుదిరిన శాంతి ఒప్పందం అబ్రాహాముకు ఆ దేశంలో అన్యుడిగా ("పరదేశివై" 21:23) ఉండడానికి మాత్రమే అనుమతి నిచ్చింది గానీ భూస్వామిగా ఉండడానికి

కాదు. ఈ శాంతి ఒప్పందం కుదిరిన తర్వాతనే, అబ్రాహాము మనుషులు త్రవ్విన బావిమీద అబీమెలెకు ప్రమాణపూర్వకంగా పూర్తి హక్కుల్ని వదులుకున్నాడు (21:30, 31) గానీ, ఆ ప్రాంతంలో అబీమెలెకు అధీనంలో ఉన్న ఇతర భూభాగాలమీద కాదని తెలుస్తోంది. పైగా పితరుని గురించి, "గుడారములో నివసించుచు, అన్యుల దేశములో ఉన్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసులైరి" (హెబ్రీ. 11:9) అని క్రొత్త నిబంధన తెలియజేస్తోంది. అబ్రాహాము "పాదము పట్టునంత భూమినైనను స్వాస్థ్యముగా" (అపో. 7:5) పొందలేదని స్తెఫను చెప్పాడు.[21] దీన్నిబట్టి ఒక నీళ్లబావిమీద హక్కు పొందడాన్ని స్వాస్థ్యంగా లేశమాత్రమైనా లెక్కించకూడదని విశదమవుతోంది; పైగా భిన్నంగా కనిపించేదేమిటంటే, బావి ఎవరూ నిలబడడానికి ఆస్కారం లేని లోతైన గుంట మాత్రమే.

క్రొత్తగా నాటిన ఈ వృక్షం బావిమీద హక్కు విషయంలో ఇరుపక్షాలు చేసుకున్న ప్రమాణాలకు ఒక స్మారక చిహ్నంగా ఉందేమో. కృతజ్ఞతాపూర్వకంగా, అబ్రాహాము సహజంగానే ప్రతిస్పందించి **నిత్యదేవుడైన యెహోవా పేరట ప్రార్థన చేశాడు** (אֵל עוֹלָם, *'El 'Olam*, "Eternal God"). పురాణేతిహాసాల్లోని అన్యదైవాలు పుట్టి గిట్టినట్టు కాకుండా, యెహోవా ఆదిగానీ అంతంగానీ లేని నిత్యదేవుడని అబ్రాహాముకు తెలుసు. అబ్రాహాముద్వారా భూమ్మీద ఉన్న సమస్తవంశాల్నీ ఆశీర్వదిస్తానని వాగ్దానం చేసినవాడు, కాలం గడిచినకొద్దీ విషమపరిస్థితుల్లోను అపాయాల్లోను అబ్రాహాముకు తోడుగా ఉండి అతనిని కాపాడినవాడు ఆయనే *'El Shadday* ("సర్వశక్తిగల దేవుడు," "God Almighty"; 17:1). సంతానాన్ని పొందే సహజధర్మాల్ని కోల్పోయి మృతతుల్యమైన అబ్రాహాము శారాల శరీరాల్లో యెహోవా నూతన జీవాన్ని నింపాడు; వారికిప్పుడు ఆరోగ్యవంతుడైన ఇస్సాకు జన్మించాడు. చివరగా, కనాను దేశంలో పరదేశిగా ఉన్న అబ్రాహాము పట్ల అబీమెలెకు దయచూపేలా లేక ఆశ్రితరక్షణ చూపేలా దేవుడు అతని హృదయాన్ని కదిలించాడు. అబ్రాహాము కృతజ్ఞత నిండిన హృదయంతో నిత్యదేవుడైన యెహోవాను ఆరాధించాడు.

**వచనము 34**. పితరుని జీవితం గురించి, **అబ్రాహాము ఫిలిష్తీయుల దేశములో అనేక దినములు పరదేశిగా నుండెను** అని ప్రస్తావిస్తూ రచయిత ఈ వృత్తాంతాన్ని ముగించాడు. ఈ సంఘటన కాలంలో, దక్షిణం మరియు తూర్పువైపు కనాను దిశగా "ఫిలిష్తీయుల దేశము" యొక్క నిర్దిష్టమైన సరిహద్దులు ఇవీ అంటూ ఏవీ లేవు. ఈ విధంగా, అబీమెలెకు మరియు ఫీకోలు బెయేర్షెబాను విడిచిపెట్టి "ఫిలిష్తీయుల దేశమునకు తిరిగి" (21:32) వెళ్లారు. అయినా, మరో అర్థంలో, అబ్రాహాము నివసించిన దేశం వారి సంపూర్ణాధిపత్యంలోనిదే. "పరదేశిగా నుండెను" (גּוּר, *gur*) అనే పదం, అబ్రాహాము కనాను దేశంలో "అన్యుడి" గానే లేక "నివాసమున్న విదేశీయుడి" గానే, తొలికాలపు ఫిలిష్తీయులకు అతి సమీపంలో

నివసించాడని సూచిస్తోంది.

# అన్వయము

## సమాధానపరచువాడైన అబ్రాహాము (అధ్యాయములు 20; 21)

దేవుడు తన ప్రజలు "సమాధానపరచువారుగా" గా ఉండాలని ఎప్పుడూ కోరుకుంటున్నాడు, అటువంటి వ్యక్తులను యేసు దీవించాడు (మత్తయి 5:9). అంటే దీని అర్థం శాంతికొరకు మనం ఏమైనా చేయవచ్చని కాదు, లేక ఇది శాంతికొరకు మన నియమాల విషయంలో మనం రాజీ పడవచ్చనీ సూచించడం లేదు. మనం అన్నివేళల్లోనూ ఉదాసీన వైఖరి చూపనవసరం లేదు; మన జీవితాల్నీ మన కుటుంబాల్నీ అపాయంలోకి నెట్టివేసే దుష్టత్వాన్ని మనం ఎదిరించవలసిన అవసరం ఉంది. "శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" అనీ, మరియు వ్యక్తిగతంగా "పగతీర్చు" కొనడానికి ప్రయత్నించకూడదనీ, సమాధానపరచువారు "పగ"తీర్చడాన్ని దేవునికే వదిలి వేయాలని పౌలు వ్రాశాడు (రోమా. 12:18, 19). ప్రాచీన కాలంనుండీ, అంటే ప్రభుత్వం అనే వ్యవస్థ ఏర్పడడానికి పూర్వంనుండి, లేదా ప్రభుత్వం అనే వ్యవస్థ ఏర్పడిన తర్వాత అది ప్రజల్ని కాపాడడంలోను మరియు దుర్మార్గుల్ని శిక్షించడంలోను అశక్తత చూపినప్పుడు (రోమా. 13:1–7), దేవుడు మనుషుల ద్వారా మనుషుల సముదాయాల (మానవ వర్గాలు) ద్వారా తన పగను తీర్చుకున్నాడు లేదా తన ప్రతీకార చర్యను అమలుచేశాడు (9:5, 6).

అన్నివేళల్లోనూ సరైన విధంగా కాకపోయినప్పటికీ అబ్రాహాము సమాధానపరచువానిగానే ఉన్నాడు. తన స్వంత భద్రత విషయంలో భయపడి, తన భార్య విషయంలో అతను రెండు సందర్భాల్లో అబద్ధం చెప్పాడు. ఐగుప్తులో ఫరోతోను (12:10–20), మళ్లీ గెరారులో అబీమెలెకుతోను (20:1–18) ఇది జరిగింది. పైగా అబ్రాహాము తన ప్రాణాన్ని కాపాడుకొనడాన్ని ఎంత మిన్నగా ఎంచాడంటే, అందుకొరకు తన భార్య శారాను సైతం అన్యరాజులకు, మొదటగా ఫరోకును తర్వాత అబీమెలెకుకు అప్పగించడానికి సిద్ధమయ్యాడు. మనమిప్పటివరకు చూచినదాని ప్రకారం అబ్రాహాము ఐశ్వర్యవంతుడూ శక్తిమంతుడూ అయిన ఒక గొప్ప నాయకుడు (వర్గనాయకుడు, బృంద నాయకుడు). తొలి కాలంలోనే, అతనికి మూడు వందల పద్దెనిమిది మంది యుద్ధాభ్యాసం చేసిన యోధులున్న స్వంత సైన్యం ఉంది (14:14), కాలక్రమేపీ వీరి సంఖ్య ద్విగుణీకృతమయ్యుంటుంది. కాబట్టి, శారా విషయంలో అబ్రాహాము ఆ ఇద్దరు రాజుల్లో ఎవరి కోరికనైనా తిరస్కరించినా వారు అబ్రాహాము మనుషులతో యుద్ధం చేయడానికి సిద్ధపడాలని కోరుకొనే వారు కారేమో. ఏమైనప్పటికీ, అతను

చేసినది పిరికితనంతో కూడిన పనే, తనను తాను కాపాడుకొన డానికి అబద్ధమాడాడు.

మరో వైపు, అధ్యాయం–14లో, నలుగురు తూర్పు రాజులు యొర్దాను మీదకు దాడి చేసినప్పుడు అబ్రాహాము అమితమైన ధైర్యసాహసాలు చూపించాడు. వీరు (తూర్పు రాజులు) అయిదుగురు రాజుల కూటమిని ఓడించి అనేకమందిని లోతును అతని కుటుంబాన్ని సహా బందీలుగా తీసుకొని వెళ్లారు. ఆ సమయానికి అబ్రాహాము స్వీయరక్షణ చర్యగా ముగ్గురు అమోరీ సోదరులతోను వారి మనుషులతోను మైత్రీబంధాన్ని ఏర్పరచుకున్నాడు. వీరి సంయుక్త సైన్యాలు గొప్ప సంఖ్యలో లేక పోయినప్పటికీ, తెలివిగా యుద్ధవ్యూహం పన్నినట్లయితే విజయం వారి స్వంతమవుతుంది, కాబట్టి వారు రాత్రివేళ ఆకస్మికదాడి చేసి తూర్పు రాజుల శక్తిమంతమైన సైన్యాల్ని త్రిప్పికొట్టి, చెరలో ఉన్న బందీల్ని ఆస్తిపాస్తుల్ని విడిపించారు. లోతును అతని కుటుంబాన్ని శత్రుదాడికి గురైన ఇతరుల్ని రక్షించడంకొరకు యుద్ధం చేయడం అబ్రాహాముకు అవశ్యమైంది. అబ్రాహాము యుద్ధంచేసి తిరుగులేని విజయం సాధించి శాంతిస్థాపకుడయ్యాడు.

అధ్యాయం–14లోని యుద్ధపిలుపు పితరుని జీవితంలో అరుదైన ఘటనయే. పితరుని జీవితంలో ఇటువంటి సంఘటన మరేదీ జరిగినట్టు మనం చదవడంలేదు. అబ్రాహాము మనుషులకు ఫిలిష్తీయులకు నడుమ శాంతి నెలకొని ఉండేలా అభయాన్నివ్వాలని అబీమెలెకు మరియు ఫీకోలు అబ్రాహామును శాంతి ఒప్పందంకొరకు సమీపించినప్పుడు, అందుకు పితరుడు వెంటనే తన సమ్మతి తెలియజేశాడు. అయితే తన మనుషులు త్రవ్విన బావి విషయంలోనే పితరుడు షరతు పెట్టడం జరిగింది; ఇందుకు రాజు అంగీకరించాడు. అబీమెలెకు అబ్రాహాముకు ఇటువంటి ప్రతిపాదన చెయ్యడం అసాధారణంగానే కనబడుతుంది, ఎందుకంటే అబ్రాహాముకు పరివారజనం క్రమంగా బలవంతులు కావడాన్ని మరియు పితరుడు చేసే పనులన్నిటిలో దేవుడతనికి తోడుగా ఉండడాన్ని సూచిస్తోంది (21:22).

అనంతర చరిత్రలో ఇశ్రాయేలు మరియు యూదా రాజులు ఇతరులతో ఒప్పందాలు చేసుకున్నప్పుడు తమ విశ్వాసం విషయంలో రాజీ పడినట్టుగా కాకుండా, అబ్రాహాము అన్యరాజుతో శాంతి ఒప్పందం చేసుకున్నప్పుడు తన విశ్వాసం విషయంలో ఎటువంటి రాజీ పడలేదు. ఇందుకు భిన్నంగా, పితరునికి అబీమెలెకుకు మధ్య ఒప్పందం కుదిరి ఇద్దరి మధ్య వ్యవహారం పరిష్కారమైనప్పుడు, అతను (పితరుడు) "నిత్యదేవుడైన" యెహోవాను ఆరాధించాడు (21:33). శాంతి ఒప్పందం (శాంతి ఒడంబడిక) జరిగిన వెంటనే అబ్రాహాము నిజదేవుని ఆరాధించడం యెహోవా అతనిని శాంతిస్థాపకుడిగా ఆశీర్వదిస్తున్నాడని సూచిస్తోంది.

"సమాధానకర్తయగు అధిపతి"గా (యెష. 9:6) యేసు ఈ లోకానికి వచ్చాడు,

ఆయన జన్మించినప్పుడు దూత "భూమిమీద సమాధానమును కలుగును గాక" (లూకా 2:14) అని ప్రకటించాడు. క్రీస్తు ద్వారా కలిగే సమాధానం, నిరాటంకమైన విధ్వంసం హత్యలు బానిసత్వం అణచివేత మొదలైనవాటిద్వారా కలిగే సమాధానం కాదు. ఆయన తన చివరి వారపు పరిచర్యలో యెరూషలేములోకి ప్రవేశించినప్పుడు, ఆయన రణరంగంలో ఉపయోగించే గుర్రంమీద గానీ సేనాధిపతులుపయోగించే రథంమీదగానీ ప్రవేశించక, భారవాహక జంతువైన గార్ధభాన్నెక్కి ప్రవేశించాడు. ఆయన ఇలా చేసి జెకర్యా 9:9, 10 వచనాల్లో, "రథములుండకుండ" "గుఱ్ఱములు లేకుండ" "యుద్ధపు విల్లు లేకుండ" పోతుందనీ, "అన్యజనులకు సమాధానవార్త తెలియ" చేయబడుతుందనీ ఉన్న ప్రవచనాన్ని నెరవేర్చాడు. అయితే యూదులు ఇటువంటి మెస్సీయాను (రాజు) కోరుకోనలేదు, లేదా రోమన్లు రాజు ఇలా ఉంటాడని ఎదురు చూడలేదు (యోహాను 18:33–38). దేవుని ప్రజలు ఖడ్గాన్ని చేత ధరించి ఆయన రాజ్యాన్ని ప్రచుర పర్చాలని యేసు కోరుకోనలేదు (మత్తయి 26:52).

యేసు తన శత్రువుల్ని నాశనంచేయడానికి రాలేదు గానీ, "నశించినదానిని వెదకి రక్షించుటకు" (లూకా 19:10) వచ్చాడు. లోకపాపాలన్నిటి నిమిత్తం ఆయన తనకు తానుగా మరణించాడు కాబట్టి, ఆయన వారి హృదయాల్లో పరివర్తన కలిగేలా చేశాడు (యోహాను 1:29; 3:16). సిలువవేయబడిన రక్షకుడు నూతనమైన విభిన్నమైన మార్గంలో విడుదలచేసిన శక్తి, అంటే సిలువకున్న బలీయమైన శక్తి ఇదే (యోహాను 12:31–33).

ఏమైనా, సిలువకు స్వీయధ్యేయం లేదు; గానీ ధ్యేయానికి నిర్దేశిత మార్గమే సిలువ. యేసు తన మరణంద్వారా, మరణానికి అంతిమ ప్రతిజ్ఞ (చివరి మాట, అంతిమ విజయం) లేదని నిరూపణాత్మకంగా చూపించాడు. ఆయన మహిమాన్విత పునరుత్థానం నవ్య యుగానికి, అంటే మెస్సీయా శాంతియుత పాలనకు ప్రారంభం పలికింది. ప్రధాన ఆజ్ఞయొక్క సందేశం యేసు క్రీస్తు ద్వారా సమాధాన సువార్తయే (అపొ. 10:36–43). స్వీయాంతరంగంలోను పొరుగువారితోను విరోధులతోను, చివరికి దేవునితోను వైరుధ్యభావంతో కల్లోలస్థితిలో కొట్టుమిట్టాడేవారిని రక్షించే రక్షకుడున్నాడు, ఆయన తానే సమాధానమై ఉన్న సమాధానాధిపతి (ఎఫెసీ. 2:13–18). ఆయన సమస్త జ్ఞానాన్ని మించిన సమాధానాన్ని అనుగ్రహించే శాంతిప్రదాత (ఫిలిప్పీ. 4:7). పితరుని వాగ్దాన "సంతానము" అయిన యేసు (గలతీ. 3:8, 16, 26–29), పితరునికి ఆత్మసంబంధమైన వారసులైనవారందరికీ ఇప్పుడూ ఎప్పటికీ అనుగ్రహించే అంతిమ శాంతికి, గత కాలంలో అబ్రాహాము మరియు ఇతరులు అనుభవించిన శాంతి ఛాయామాత్ర మైనదే.

## ఇస్సాకు చుట్టూ ఉన్నవారి ప్రత్యుత్తరము (21:8–19)

ఈర్ష్య హేళన ఆగ్రహం దుఃఖం నిరాశ మరియు నిరీక్షణ: ఇస్సాకు పుట్టిన తర్వాత అబ్రాహాము కుటుంబ సభ్యుల్లో నానావిధాలైన ఈ మిశ్రమ స్పందనలున్నాయి. వాగ్దాన సంతానం (వాగ్దాన కుమారుడు) పెరిగి పెద్దవాడవుతుండగా ఇష్మాయేలు అతని పట్ల ప్రతికూలవైఖరి ప్రదర్శించాడు.

*ఇష్మాయేలు ప్రతిస్పందన: ఈర్ష్య హేళన* (21:8, 9). ఇష్మాయేలు ఈర్ష్యతో ప్రతిస్పందించడానికి కారణం బహుశా అతని తల్లి హాగరు ప్రేరేపణ అయ్యుండవచ్చు, ఈమె తన యజమానురాలి పట్ల ద్వేష భావాన్ని చూపెట్టింది. శారా వాగ్దానసంతానానికి (వాగ్దాన కుమారునికి) తల్లి అయిన తర్వాత మరీ ఎక్కువగా హాగరులో ద్వేషభావం ఇనుమడించింది. ఈ పిల్లవాడొకడే (ఇష్మాయేలు) అబ్రాహాముకు కుమారుడైనట్లయితే అతను బానిస–భార్యకు పుట్టినా సరే, అబ్రాహాము వారసత్వాన్ని అంది పుచ్చుకొనే ఏకైక వారసుడయ్యేవాడు. కేవలం మూడు సంవత్సరాల పసిప్రాయంలో ఉన్న చిన్నపిల్లవాడిని, పదహారు లేక పదిహేడు సంవత్సరాల వయసున్న ఇష్మాయేలు హేళన చేయడంలో ఎంత అహంభావం డాబుసరి తనం దాగి ఉన్నాయి! ఇష్మాయేలు "అడవిగాడిద వంటి మనుష్యుడు" (16:12) అవుతాడని, అతని చెయ్యి అందరి చేతులకు విరోధంగా ఉంటుందనీ దేవుడు ముందుగానే తెలియజేశాడు; ఇక అతను యుక్త వయసులోనే తన స్వభావాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టాడు.

పిల్లవాడైన ఇస్సాకు పట్ల ఇష్మాయేలు ప్రతిస్పందన ఒక మూలాధారమైన లేక ప్రధానమైన ఘర్షణ గురించి అంటే శరీర కార్యాలకు ఆత్మఫలానికి మధ్య ఉన్న పరస్పర విరుద్ధతత్వాన్ని సవివరంగా తెలియజేస్తోంది. కయీనుకు అతని తమ్ముడైన హేబెలు పట్ల పెల్లుబికిన ఇదే విధమైన ఘర్షణ (యుద్ధాపేక్ష), చివరికి అతను తన తమ్ముణ్ణే హత్య చేసేంత ద్వేషానికి దారితీసింది (4:3–8). పౌలు తదుపరి కాలంలో ఇటువంటి శరీర కార్యాల్ని వర్గీకరించి సవివరంగా తెలియజేసిన పట్టికలో ఘర్షణలకు దారితీసే అంతఃవైఖరులైన ఈర్ష్య పగ మొదలైనవి కూడా ఉన్నాయి (గలతీ. 5:19–21). అపొస్తలుని నిర్ణాయకమైన సమాలోచనకు (తీర్పు) కారణమేమింటే, ఇటువంటి అంతఃవైఖరుల్ని నిరోధించకపోయినట్లయితే, ఇవి ఎప్పటికీ మానవ సంబంధాలకు తీవ్రమైన వినాశనం కలిగిస్తాయి.

యాకోబు భార్య రాహేలు గొడ్రాలైనందున, యాకోబుకు పిల్లల్ని కనిన లేయా పట్ల రాహేలు ద్వేష భావాన్ని చూపింది. రాహేలు తాను పిల్లల్ని కనలేక పోవడానికి యాకోబును నిందించగా, అతను కోపావేశంతో, "నేను నీకు గర్భఫలమును ఇయ్యక పోయిన దేవునికి ప్రతిగా నున్నానా" (30:2) అని అడిగాడు. యోసేపు సోదరులు తమ తండ్రి తనకు బాగా ఇష్టమైన కొడుకుపట్ల (యోసేపు) చూపిస్తున్న స్వాతిశయభావాన్ని సహించలేకపో వడంతో, విముఖతతో కూడిన వారి ఆగ్రహం

బహిరంగ ఘర్షణకు అంటే యోసేపును చంపివేయాలని అనుకొనేంతవరకు పరిణమించింది.

వివాదాలకు భగ్నహృదయాలకు దారి తీసే ఈర్ష్య పగ మొదలైన దుర్గుణాలు వైవాహిక జీవితాల్లోను కుటుంబాల్లోను మాత్రమే కాక, జీవితంలో అన్ని విషయాల్లోను (రంగాల్లోను) వినాశనానికి కారణమౌతాయి. ఇటువంటి వైఖరులే యూదియ నాయకులు యేసును మరణానికి అప్పగించేలా చేశాయి (మత్తయి 27:18; మార్కు 15:10); అంతే కాదు, ఆదిసంఘ కాలంలో ఆధ్మాత్మిక జీవితానికి పెనుముప్పుగా పరిణమించిన పలు విభేదాలకు కారణమయ్యాయి (1 కొరింథీ. 3:3; 13:4; గలతీ. 5:26; ఫిలిప్పీ. 1:15; 2:3; యాకోబు 3:14–16; 1 పేతురు 2:1–2). దేవుని ప్రజలు ఇటువంటి ప్రాణాంతకమైన ప్రాబల్యాలనుండి తమను తాము అన్ని వేళల్లోనూ కాపాడుకొంటూ ఉండాలి.

*శారా ప్రతిస్పందన: కోపం మరియు విద్వేషం (విరోధభావం)* (21:10). ఇష్మాయేలు ఇస్సాకును హేళనచేస్తూ ఆటపట్టించడం[22] వినిన శారా ఉద్రేకపడి ప్రతిస్పందించింది. యుక్తవయస్కుడైన ఇష్మాయేలు మాటలు చర్యలు భవిష్యత్తులో తన కుమారునికి కలగబోయే అపాయానికి సంకేతాలుగా శారా నిర్ధారించు కుంది. ఆమె నిర్ధారణలో ఆమె ఆలోచనలు సరైనవే అయ్యుండవచ్చు; అయితే ఆమె కోపావేశంతో తన భర్తతో, "ఈ దాసిని దీని కుమారుని వెళ్లగొట్టుము; ఈ దాసి కుమారుడు నా కుమారుడైన ఇస్సాకుతో వారసుడై యుండడు" (21:10) అని చెప్పింది. ఇస్సాకు భద్రతకొరకు శారా తన భర్తను అతని బానిస–భార్యను ఆమె కుమారునితో సహా భద్రతకొరకు వెళ్లగొట్టమని (పరిత్యజించమని, బొత్తిగా విడిచిపెట్టమని) అడగడం ఆమె వైపునుండి సమంజసమే అయ్యుండవచ్చు. అయినా, ఆమె హాగరుపట్ల ఇష్మాయేలుపట్ల అసూయను విద్వేషాన్ని చాలా కాలం తనలో దాచుకొని, వారిని వెళ్లగొట్టడానికి ఇప్పుడు వచ్చిన సందర్భాన్నుపయోగించుకొంది.

*అబ్రాహాము ప్రతిస్పందన: దురవస్థ మరియు దుఃఖం* (21:11–14). శారా అవశ్యాభ్యర్థనపట్ల అబ్రాహాము వెంటనే ప్రతిస్పందించాడు, అయితే తన మొదటి కుమారుడైన ఇష్మాయేలుపట్ల అతనికున్న ప్రేమ అతనికి తీవ్రమైన విషాదాన్ని మిగిల్చింది. ఏమైనప్పటికీ, ఈ ఇద్దరు స్త్రీల మధ్య ఏ మాత్రం పొసగకపోవడం అబ్రాహాముకు అవగతమైంది. పరస్పరం శత్రువులుగా ఉన్న వీరిద్దరూ వీరి పిల్లలూ అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటే ఇక వైవాహిక జీవితంలోనూ ఇంట్లోనూ శాంతి మిగలదని అబ్రాహాము తెలుసుకున్నాడు. దేవుడు ఈ విషయాన్నే అబ్రాహాముకు, "ఈ చిన్నవానిబట్టియు నీ దాసినిబట్టియు నీవు దుఃఖపడవద్దు. శారా నీతో చెప్పు ప్రతి విషయములోను ఆమె మాట వినుము; ఇస్సాకు వలన అయినదియే నీ సంతాన మనబడును" (21:12) అని దృఢంగా చెప్పాడు. తర్వాత దేవుడు అబ్రాహాముకు అభయాన్నిస్తూ తాను ఇష్మాయేలును కూడా ఆశీర్వదిస్తాననీ, "నీ

సంతానమే గనుక అతనికూడ ఒక జనముగా చేసెదనని" (21:13) చెప్పాడు.

ఈ సందర్భంలో దేవుడిచ్చిన అభయం మరియు వాగ్దానం అబ్రాహాము తదుపరి చర్యల్ని మనం అర్థం చేసుకొనడానికి సహాయపడతాయి. అబ్రాహాము హాగరును ఇష్మాయేలును ఒక రోజుకైనా సరిపోని ఆహారపదార్థాల్నిచ్చి దూరంగా అరణ్యంలోకి పంపివేయడంలో అతను ఏ మాత్రం అనాలోచితంగానూ కఠినంగానూ వ్యవహరించలేదు. హాగరు అంతకు ముందొకసారి పారిపోయినప్పుడు, "యెహోవా దూత" ఆమెను తన యజమానురాలికి తిరిగి వెళ్లమని చెప్పాడు. హాగరుకు కుమారుడు పుడ్తాడనీ, హాగరు సంతానాన్ని కూడా విస్తారమైన జనంగా చేస్తాననీ కూడా దేవుడు చెప్పాడు (16:7–14). ఇంకా, దేవుడు అతనిని "ఆశీర్వదించి" అతను "పండ్రెండుమంది రాజుల" కు తండ్రి అయ్యేలా చేస్తాననీ వారినొక "గొప్ప జనముగా" చేస్తాననీ చెప్పాడు (17:20). ఇష్మాయేలు భవిష్యత్తు గురించి వాగ్దానాల్ని పునరుద్ఘాటిస్తూ యెహోవా మాట్లాడినందువలన (21:13), అబ్రాహాము ఇక ఏ మాత్రం సందేహించలేదు. అతను వారికి కొద్దిపాటి భోజనపదార్థాలిచ్చి, ప్రతికూలమైన అరణ్య వాతావరణంలో ఆయనే వారిని కాపాడి వారికి కావలసినవి సమకూర్చుతాడనే నమ్మికతో వారిని దూరంగా పంపివేశాడు (21:14).

*హాగరు ప్రతిస్పందన: నిరాశ, తర్వాత ఆనందం* (21:15–19). అబ్రాహాముకున్నంత నమ్మిక (భరోసా, ఆత్మవిశ్వాసం) హాగరులో లేదు. అనేక సంవత్సరాల క్రితం ఆమె అరణ్యంలో నీటి బుగ్గను (జలధార, నీటి ఊట) కనుగొనడం, అక్కడ దేవుని దూత ఆమెకు ప్రత్యక్షమై ఆమె కుమారుని గురించి వారి భావితరాలగురించి వాగ్దానాలు చేసిన అనుభవాన్ని ఆమె మర్చిపోయింది (16:7–14). ఈసారి, మిట్టమధ్యాహ్నం వేళలో, నీరు ఇంకిపోయిన సమయంలో, నిరాశ (నిస్పృహ, నిస్సత్తువ) ఆవరించిన తల్లి తన కుమారుణ్ణి పొద క్రింద పడవేసి, తన కుమారుని చావు తాను చూడలేనని దేవునికి మొరపెట్టింది (21:16). మరొకసారి, దేవుని దూత పరలోకంనుండి మాట్లాడాడు. బాలుని యేడ్పును వినిన దేవుని దూత, ఇష్మాయేలు వంశస్థులు ఒక గొప్ప ప్రజ (జనం) అవుతారనే వాగ్దానాన్ని పునఃధ్రువీకరణ చేశాడు (21:17–18). వారు సేదతీరేలా ఆయన ఆమెకు నీటి ఊటను చూపించాడు.

దేవునికి తన వాగ్దానాల పట్ల ఉన్న విశ్వసనీయత (విశ్వాస్యత) నిరూపణాత్మకంగా వెల్లడైన మరొక దృష్టాంతమిది. ఆయన తన ప్రజలు తననింకా ఎక్కువగా నమ్మేలా, ఆయన వారి విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలని కోరుకుంటున్నాడు. దేవుడు తరతరాలుగా తన ఉన్నతమైన ప్రణాళికను అబ్రాహాము మరియు అతని కుటుంబం ద్వారా కార్యరూపంలోకి తెచ్చాడు; అయినా ఈ కార్యాచరణలో ప్రమేయమున్నవారు తమ స్వంత విషయాల గురించి మాత్రమే ఆలోచించిన సందర్భాలున్నాయి. ఎన్నిసార్లు మనం మన అవధిని మించి దేవుని మహోన్నత కార్యాచరణను చూడగలుగుతున్నాం!

## సూచనలు

[1]Gordon J. Wenham, *Genesis 16–50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 80–81. [2]E. A. Speiser, *Genesis*, The Anchor Bible, vol. 1 (Garden City, N.Y.: Doubleday & Co., 1964), 155. 1 సమూ. 1:22–24, మరియు 2 మక్కబీ. 7:27 చూడండి. [3]ఇష్మాయేలు జన్మించిననాటికి అబ్రాహాము వయస్సు ఎనబైఆరు (16:16) మరియు ఇస్సాకు పుట్టిననాటికి నూరు సంవత్సరాలు (17:17; 21:5), ఇష్మాయేలు సుమారుగా పదునాలుగు సంవత్సరములప్పుడు (17:24, 25 చూడండి). సుమారుగా మూడు సంవత్సరముల తరువాత, ఇస్సాకు పాలు తాగే సమయానికి, ఇష్మాయేలు కనీసం పదహారు లేక పదిహేడు సంవత్సరముల వయస్సు గలవాడై ఉండియుండవచ్చు. [4]J. Barton Payne, "צָחַק," in *TWOT*, 2:763. [5]Kenneth A. Mathews, *Genesis 11:27–50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 269. [6]Helmer Ringgren, "גֵּרַשׁ," in *Theological Dictionary of the Old Testament*, trans. John T. Willis and Geoffrey W. Bromiley, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1978), 3:68–69. [7]పూర్తిగా పెరిగిన ఒక మేక యొక్క చర్మము మూడు గ్యాలన్ల నీరు కలిగియుంటుంది మరియు అది సుమారుగా ముప్పై పౌండ్ల బరువు కలిగియుంటుంది. [8]దక్షిణ ఇశ్రాయేలులో మరియు సీనాయి ద్వీపకల్పములో పర్వతారోహణ చేయువారు ఆ ప్రతికూల వాతావరములో జీవించడానికి కనీసం రోజుకు రెండు గేలెన్ల నిరు అయినా తాగాలని అనుభవమున్న మార్గదర్శకులు చెప్తారు. [9]Walter C. Kaiser, Jr., Peter H. Davids, F. F. Bruce, and Manfred T. Brauch, *Hard Sayings of the Bible* (Downers Grove, Ill.: InterVarsity Press, 1996), 123. [10]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 284.

[11]Ibid., 285. [12]Wenham, 91. [13]Frederick W. Bush, "Hurrians," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:784–85. [14]Wenham, 91–92. [15]E. Kutsch, "כרת," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 2:636. [16]Jack P. Lewis, "בְּאֵר שֶׁבַע," in *TWOT*, 1:87. "బేయేర్షేబ" అను పేరుకు రెండవ వివరణ ఆదికాండము 26:31-33లో కనబడుతుంది. [17]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18–50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 93. [18]K. A. Kitchen, *On the Reliability of the Old Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2003), 340–41. [19]Hamilton, 94. [20]Wenham, 94.

[21]మక్పేలా గుహ, శారాను పాతిపెట్టుటకు అబ్రాహాము తరువాత హెబ్రోనులో కొనుగోలు చేసినది, ఇది పితరునికి ప్రభువు అనుగ్రహించిన స్వాస్థ్యబహుమతిలోని భాగము కాదు (23:1–20 చూడండి). [22]ఇష్మాయేలు ఇస్సాకును "పీడించెను" అని పౌలు వాక్యమును అర్థము చేసుకొనెను (గలతీ. 4:29); కాని అది

మానకమైనదా, భౌతికమైనదా, లేదా రెండు విధాలుగానా అన్న విషయం ఆయన తెలుపలేదు.